ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం 43.0 28.0



కూటమి మేనిఫెస్టో కేక

అన్ని వర్గాలలో హర్షాతిరేకాలు .. డీలా పడిన వైసీపీ అభ్యర్థులు.. కూటమి అభ్యర్థుల్లో కదనోత్సాహం

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టోతో వైసీపీ డీలా పడింది. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేనాని పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సిద్ధార్థ్‌సింగ్ సమష్టిగా మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఉండవల్లిలో ప్రజాగళం పేరుతో కూటమి మేనిఫెస్టోను విడుదల చేశారు. ఆ తరువాత గంట వ్యవధిలోనే కూటమి మేనిఫెస్టో అంశాలపై ఎక్కడ చూసినా చర్చ జరిగింది. నలుగురు కలిసిన చోటల్లా దీని గురించే మాట్లాడుకున్నారు. రాజకీయ విశ్లేషకులు, మేధావివర్గాలు సైతం ప్రధానంగా చర్చించారు. అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక చేయూతనివ్వడంతో పాటు.. ఉద్యోగులు, నిరుద్యోగ యువతకు భరోసానిచ్చేలా మేనిఫెస్టో ఉందని సర్వత్రా అభిప్రాయం వ్యక్తమైంది. మరీ ముఖ్యంగా మహిళల ఆర్థిక స్వావలంభనకు మేనిఫెస్టో రాచబాట అని ఆ వర్గాలు అంటున్నాయి. బడుగు, బలహీన వర్గాలకు మేనిఫెస్టోలో అత్యంత ప్రాధాన్యం కల్పించారని హర్షం వ్యక్తమౌతోంది. భూ యజమానులకు గుదిబండగా మారిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను కూటమి అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని మేనిఫెస్టోలో స్పష్టంగా ప్రకటించిన నేపథ్యంలో ఆ వర్గాలన్నీ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

\- ఆంధ్రజ్యోతి, అనంతపురం

మిషన్ రాయలసీమకు హామీ



రాయలసీమ అంటేనే కరువు కాటకాలకు నిలయం. ఇక్కడ రైతాంగానికి వ్యవసాయమే జీవనాధారం. సీమ రైతు బాధలను, ఇక్కడి పరిస్థితులను యువగళం పాదయాత్రలో కళ్లారా చూసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, తన పాదయాత్రలోనే మిషన్ రాయలసీమ పేరుతో రాయలసీమ జిల్లాలను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తామని మాట ఇచ్చారు. ఆ మాటను కూటమి మేనిఫెస్టోలో నారా లోకేశ్ నిలబెట్టుకున్నారు. మిషన్ రాయలసీమ అమలుకు చర్యలు తీసుకుంటామని మేనిఫెస్టోలో స్పష్టం చేయడం ఈ ప్రాంత ప్రజలకు మరింత ఊరటనిచ్చినట్లయింది. సూపర్‌సిక్స్ పథకాల మేనిపెస్టో.. కూటమి అభ్యర్థుల్లో కదనోత్సాహన్ని నింపుతోంది. వైసీపీ అభ్యర్థులు డీలా పడేలా చేసింది.

ఇపుడెలా..?



కూటమి మేనిఫెస్టోతో వైసీపీ అభ్యర్థులు డోలాయమానంలో పడ్డారు. సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టో కొత్త సీసాలో పాత సారా అన్న చందంగా ఉండటంతో ఆ పార్టీ అభ్యర్థులు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. గోరుచుట్టుపై రోకటిపోటు అన్న చందంగా... అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించడమే కాకుండా, ఆర్థిక చేయూతనిచ్చే విధంగా కూటమి మేనిఫెస్టో ఉండటం ఆ పార్టీ అభ్యర్థులను మరింత కుంగదీస్తోంది. నియోజకవర్గానికి ఐదేళ్ల పాటు అధికార పార్టీ ప్రజాప్రతినిధిగా ఉన్నామనేదేగాని, మొత్తం వ్యవహారమంతా సీఎం బటన్ నొక్కుడుతోనే సరిపోయిందన్న వేదన ఆ పార్టీ అభ్యర్థులను వెంటాడుతోంది. ప్రజలు ఆశించిన స్థాయిలో నియోజకవర్గ అభివృద్ధి జరగలేదని వైసీపీ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. బటన్ నొక్కుడు పథకాలకంటే... కూటమి మేనిఫెస్టోనే బేషుగ్గా ఉందనే అభిప్రాయం అన్ని వర్గాల ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఇది వైసీపీ అభ్యర్థులను మరింత కలవరపాటుకు గురిచేస్తోంది.

కదనోత్సాహం..



కూటమి మేనిఫెస్టో ఆ పార్టీ అభ్యర్థుల్లో కదనోత్సాహన్ని నింపుతోంది. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనపై విసిగివేసారిన అధికార పార్టీలోని బడుగు, బలహీన వర్గాలతో పాటు.. అధికార పార్టీ సామాజికవర్గం నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి వలస వెళుతున్నారు. ఇది కూటమి అభ్యర్థులకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజల నుంచి సానుకూల స్పందన, వైసీపీ నుంచి వలసల జోరు కూటమి అభ్యర్థుల్లో రెట్టింపు ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ పరిణామాలతో ప్రచారంలో దూకుడు పెంచుతున్నారు. ఎక్కడికక్కడ వైసీపీ అభ్యర్థుల అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, దాడులను ఎండగడుతూనే... సూపర్ సిక్స్ పథకాల లబ్ధి గురించి ప్రజలకు వివరిస్తున్నారు. ప్రజలలో మరింత చైతన్యాన్ని నింపి, విజయానికి బాటలు వేసుకుంటున్నారు.

మహిళలు.. మహా రాణులు



ప్రజాగళం పేరుతో కూటమి అధినేతలు విడుదల చేసిన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలు కూటమికి అధికారం కట్టబెట్టడం ఖాయమనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకులు, మేధావివర్గాలలో వ్యక్తమౌతోంది. అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక చేయూతనందించే విధంగా మేనిఫెస్టో రూపొందించారని మేధావులు అంటున్నారు. దీపం పథకం కింద మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం, ప్రతి ఇంటికి ఉచిత కొళాయి కనెక్షన్, ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వడం, ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం పేరుతో ఇంట్లో ప్రతి బిడ్డకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పడం, రూ.10 లక్షల వరకూ వడ్డీ లేని డ్వాక్రా రుణాలు.. ఇలా మహిళల ఆర్థిక స్వావలంభనకు పెద్ద పీట వేశారు. తద్వారా ఆ వర్గాలన్నీ కూటమికి మరింత దగ్గరయ్యాయి.

అన్నదాతకు చేయూత

రైతులకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని మేనిఫెస్టోలో చెప్పడం అన్నదాతలలో ఆశలు చిగురించేలా చేసింది. కరువు రైతుకు పెట్టుబడి సాయంతో పాటు... డ్రిప్, స్ప్రింక్లర్లు 90 శాతం సబ్సిడీతో ఇస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం చేస్తానని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రతి సభలో చెప్పడమే కాకుండా మేనిఫెస్టోలోనూ ఒక అంశంగా చేర్చారు. నిరుద్యోగ యువతలో భరోసా నింపారు.


ఎయిడెడ్.. ఊపిరి



ఎయిడెడ్ కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పునరుద్ధరిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు. ఇది ఆ విద్యాసంస్థలకు జీవం పోస్తుంది. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లను తొలగిస్తారని వైసీపీ ప్రచారం చేస్తోంది. ఆ ప్రచారానికి అడ్డుకట్ట వేసేలా.. వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, నెలకు వలంటీర్లకు రూ.10 వేలు గౌరవ వేతనంగా ఇస్తామని చెప్పారు. అన్న క్యాంటీన్లు, పండుగ కానుకలు పునరుద్ధరిస్తామని చెప్పారు. ఈ అంశాలన్నీ కూటమి అధికారంలోకి రావడానికి దోహదపడతాయని అభ్యర్థులు దీమా వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన హామీలు

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- దీపం పథకం కింద ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు
- యువతకు 20 లక్షల ఉద్యోగాలు
- నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు భృతి
- తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు (కుటుంబంలో ఎంత మందికి ఉంటే అంత మందికి)
- ప్రతి ఇంటికి ఉచిత కొళాయి కనెక్షన్
- ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు రూ.1500 (18 సంవత్సరాల నుంచి 59 ఏళ్ల వరకూ)
- బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం
- ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం
- బీసీలకు 50 ఏళ్లకే పింఛన్...
- పింఛన్ నెలకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, పూర్తి దివ్యాంగులైతే రూ. 10 వేలు
- పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు... గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ఇంటి స్థలం
- వలంటీర్లకు నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం



బీసీల పార్టీ

తెలుగుదేశం అంటేనే బీసీల పార్టీ. ఆ వర్గాల రక్షణకు ప్రత్యేక చట్టంతో పాటు ఆర్థికంగా చేయూతనందిచేందుకు ఐదేళ్లల్లో రూ.1.50 లక్షల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ అమలు, బీసీల స్వయం ఉపాధికి ఏడాది రూ.10 వేల కోట్లు, ఆదరణ కింద మరో రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అమలు చేస్తామన్నారు. ఇవి ఆ వర్గాల అభ్యున్నతికి మరింత దోహదపడతాయి. గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్లు, రజకుల కోసం దోభీఘాట్‌లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, వడ్డెర్లకు క్వారీల్లో 15 శాతం రిజర్వేషన్లు, ఆలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు రూ.2 వేలు గౌరవ వేతనం, స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్, మత్స్యకారులకు రూ.20 వేల ఆర్థికసాయం, ఎంఎస్ఎంఈ, స్టార్టప్‌లకు రూ.10 లక్షలు రాయితీ, చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు, ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపు, ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం కన్యకాపరమేశ్వరీ ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం.. ఇవన్నీ ఆయా వర్గాలను టీడీపీకి మరింత చేరువ చేస్తాయని విశ్లేషకులు అంటున్నారు.



ఎస్కేయూ డిగ్రీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్: మొత్తానికి ఎస్కేయూ డిగ్రీ ఫలితాలు విడుదలయ్యాయి. డిసెంబరు, జనవరిలో పరీక్ష రాసిన డిగ్రీ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ విద్యార్థులు.. ఫలితాల కోసం నెలల తరబడి ఎదురుచూశారు. కళాశాలల యాజమాన్యాలు వర్సిటీ అధికారులను బతిమాలి.. చాలించుకున్నాయి. ఈ క్రమంలో పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ అధ్యక్షతన వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య మంగళవారం ఫలితాలను విడుదలచేశారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ రెగ్యులర్ విద్యార్థులు 27,976 మంది పరీక్షలు రాయగా, 16,559 మంది పాసయ్యారని తెలిపారు. మొత్తంగా 59 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సప్లిమెంటరీ పరీక్షలను 19,593 మంది విద్యార్థులు 41,222 సబ్జెక్టులను రాయగా.. 22,483 సబ్జెక్టులు ఉత్తీర్ణులయ్యారని వీసీ తెలిపారు. 54 శాతం ఉత్తీర్ణత నమోదైందని అన్నారు. ఫలితాలను బుధవారం జ్ఞానభూమి పోర్టల్‌లో ప్రదర్శిస్తామని తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు రీవాల్యుయేషన్, ఫిజికల్ వెరిఫికేషన్ కోసం ఒక పేపర్‌కు రూ.500 చొప్పున ఈ నెల 15లోపు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ డాక్టర్ శ్రీరాములు నాయక్, ఏఆర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మకాన్ని నింపుతున్న మేనిఫెస్టో

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ



రాయదుర్గం, ఏప్రిల్ 30: కూటమి మేనిఫెస్టో అన్ని వర్గాల్లో నమ్మకాన్ని నింపుతోందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. పట్టణంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేసేలా ఎంఎస్ఎంఈలకు అత్యధిక ప్రోత్సాహకాలు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల పునరుద్ధరణ వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. ఏటా నాలుగు లక్షల ప్రకారం.. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు భర్తీకి కూటమి మేనిఫెస్టో హామీ ఇచ్చిందని అన్నారు. తొలి సంతకం మెగా డీఎస్సీపై ఉంటుందని స్పష్టం చేశారు. దళితులు, మైనార్టీల సంక్షేమానికి మేనిఫెస్టో అధిక ప్రాధాన్యం ఇస్తోందని, మత్స్యకారులకు, చేనేత కార్మికులకు, నాయీబ్రాహ్మణులకు, రజకులకు, యాదవులకు ప్రత్యేక హామీలు ఇచ్చిందని తెలిపారు. వ్యవసాయాన్ని బతికించడంతోపాటు లాభసాటిగా మార్చడానికి హామీలను పొందుపరిచారని అన్నారు. పోలవరాన్ని పూర్తి చేస్తామని, నదుల అనుసంధానానికి ప్రాధాన్యం ఇస్తూ.. సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి పెద్దపీట వేస్తామని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చడంతో పాటు కియ లాంటి పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యం ఇస్తామని అన్నారు.

వైసీపీ నేతలకు ఓటమి భయం

కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ



అంబికా లక్ష్మీనారాయణ, దగ్గుబాటికి హారతి పడుతున్న మహిళలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 30: వైసీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే అసత్య ప్రచారాలతో మైనార్టీలను రెచ్చగొడుతున్నారని అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ మండిపడ్డారు. నగరంలోని 17, 18వ డివిజన్లల్లో అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్‌తో కలిసి ఆయన మంగళవారం విస్తృతం ప్రచారం చేశారు. ఎన్డీయే కూటమి అభ్యర్థులకు జనం నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే వైసీపీ నాయకులు కుట్రలకు తెరలేపుతున్నారని అన్నారు. ఎన్డీయే కూటమిలో గతంలో ఉన్నప్పుడు మైనార్టీలను ఏ సమస్య రాకుండా టీడీపీ చూసుకుందని గుర్తు చేశారు. టీడీపీ హయాంలోనే ముస్లిం మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి న్యాయం చేశామని అన్నారు. వైసీపీ అరాచక పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కల్పించేందుకే బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని అంబికా అన్నారు. వైసీపీ నాయకుల కుట్రపూరిత మాటలను మైనార్టీలు నమ్మవద్దని కోరారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం ఖాయమని, చంద్రబాబు తిరిగి సీఎం కావడం తథ్యమని ఆయన దీమా వ్యక్తం చేశారు.

రైళ్ల దారిమళ్లింపు

గుంతకల్లు, ఏప్రిల్ 30: ఖాజీపేట-కొండపల్లి సెక్షన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా ఓ ఎక్స్‌ప్రెస్ రైలు అప్ అండ్ డౌన్ సర్వీసులను దారిమళ్లించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. బెంగళూరు సిటీ-దానాపూర్ (06509) రైలును మే 6, 13, 20 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలును(06510) మే 1, 8, 15, 22 తేదీల్లోనూ దారిమళ్లించి పంపుతామని తెలిపారు. ఈ రైళ్లను ఇటార్సి, ఖాండ్వా, మన్మాడ్, డౌండ్, వాడీ, గుంతకల్లు, ధర్మవరం, యలహంక, బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్ల మీదుగా మళ్లిస్తామని తెలిపారు.

టీడీపీ కార్యకర్తపై దాడి



గాయపడిన కార్తీక్

ఉరవకొండ, ఏప్రిల్ 30: పట్టణంలో వడ్డే వీధిలో టీడీపీ కార్యకర్త కార్తీక్‌పై వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. కాలనీలో వైసీపీ నాయకులు మంగళవారం ఉదయం ప్రచారం నిర్వహించారు. అనంతరం వైసీపీ కార్యకర్త ఆది, ఆ పార్టీ జెండాలు పట్టుకుని ద్విచక్రవాహనానికి సైలెన్సర్ తీసేసి హడావుడి చేశాడు. స్థానికులు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించారు. టీడీపీ కార్యకర్తలు సాయంత్రం సంబరాలు చేసుకుంటుండగా, వైసీపీ కార్యకర్త ఆది, ఆ పార్టీ నాయకులు అక్కడికి వచ్చారు. టీడీపీ కార్యకర్త కార్తీక్‌పై దాడి చేశారు. శ్రీకాంత్, రాజుపై దాడికి ప్రయత్నించారు. ఈ దాడిలో కార్తీక్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైసీపీ నాయకులు షంషుద్దీన్, సలాం, గంగరాజు, తిలక్ తదితరులు తనపై దాడి చేశారని బాధితుడు తెలిపారు. దాడికి పాల్పడిన వైసీపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని హల్‌చల్ చేశారు. టీడీపీ నాయకులపై కేసు నమోదు చేయాలని ఒత్తిడి తెచ్చారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆ తర్వాత కార్తీక్ కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని నిరసన తెలిపారు. కార్తీక్‌పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో పోలీసులు సర్దిచెప్పి పంపించారు. కార్తీక్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు.



పోలీస్‌స్టేషన్ వద్ద గుమిగూడిన టీడీపీ కార్యకర్తలు, కార్తీక్ కుటుంబసభ్యులు

అధికారుల నిర్ణయం తప్పు..



పింఛన్‌ను బ్యాంకు ఖాతాల్లో జమచేయడం మాలాంటి వృద్ధులకు ఇబ్బంది కలిగిస్తుంది. పింఛన్ సొమ్ము తెచ్చుకునేందుకు పడరాని పాట్లు పడాల్సి ఉంటుంది. బ్యాంకుల వద్ద గంటల తరబడి క్యూలైన్లో నిలబడేందుకు శక్తి ఉండదు. అధికారులు తీసుకున్న నిర్ణయం సరైనది కాదు. ఇంటి వద్దే పింఛన్ ఇవ్వాలి.

\- ఓబులమ్మ, దివ్యాంగురాలు, ఉరవకొండ



పింఛన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు(ఫైల్)

పింఛన్లు బ్యాంకులో వేయడం సరికాదు

ఏమైనా పద్ధతా?

పింఛన్ల పంపిణీలో రాజకీయాన్ని వైసీపీ ప్రభుత్వం కొనసాగిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేసే వెసులుబాటు ఉన్నా.. బ్యాంకు ఖాతాలలో జమచేస్తామని చెప్పడం లబ్ధిదారులను ఇబ్బంది పెట్టడమేనని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకులో సొమ్ము జమ అయిందో లేదో తెలుసుకోవడం, బ్యాంకు నుంచి నగదు విత్‌డ్రా చేసుకోవడం దివ్యాంగులు, వృద్ధులకు ఇబ్బందికరం. ఎండలు మండిపోతున్న తరుణంగా బ్యాంకులకు వెళ్లడం వారికి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. జిల్లా వ్యాప్తంగా 663 గ్రామ, వార్డు సచివాలయాలలో 5,976 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరందరూ పింఛన్ల పంపిణీ చేపడితే.. సగటున ఒక్కో ఉద్యోగికి 54 మంది లబ్ధిదారులు మాత్రమే వస్తారు. వలంటీర్లకు యాభై కుటుంబాల బాధ్యతను మాత్రమే అప్పగించారు. ఈ లెక్కన వలంటీర్లకు బదులుగా సచివాలయ ఉద్యోగులు పింఛన్లను సులువుగా పంపిణీ చేయవచ్చు. గత నెలతో పోలిస్తే లబ్ధిదారుల సంఖ్య ఈ నెల 797 తగ్గింది. ఇందుకు వివిధ కారణాలు చెబుతున్నా, ఆర్థిక భారం తగ్గించుకునేందుకే ప్రభుత్వం ఇలా చేస్తోందని బాధితులు ఆరోపిస్తున్నారు.

\- అనంతపురం క్లాక్‌టవర్/ఉరవకొండ

85 వేల మందికి...

జిల్లాలోని 2,88,334 మంది పింఛన్‌దారులకు మే నెలకు రూ.86.33 కోట్లు మంజూరు చేశారు. లబ్ధిదారులలో 85,618 మందికి మాత్రమే ఇళ్ల వద్ద పింఛన్ పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. మిగిలినవారికి రూ.60.81 కోట్లు ఆధార్ అనుసంధానమై, ఎన్‌పీసీఐ ద్వారా నిర్ధారించిన బ్యాంకు ఖాతాలకు జమచేస్తామని తెలిపారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాని పింఛన్‌దారులకు, ప్రత్యేక కేటగిరి విభిన్న ప్రతిభావంతులు, మంచానికే పరిమితమైన వారికి, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, నడవలేని స్థితిలో ఉన్నవారికి ఇళ్ల వద్దనే పింఛన్ పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ పింఛన్ల పంపిణీ గందరగోళంగా సాగింది. వృద్ధులు, విభిన్నప్రతిభావంతులు నానా అవస్థలు పడ్డారు.

వృద్ధులు, దివ్యాంగులకు విత్ డ్రా ఇబ్బందికరం

బ్యాంకుల్లో గంటలకొద్దీ క్యూలో ఉండాల్సిందే..

ఇంటి వద్దే పింఛన్లు ఇచ్చే వీలున్నా.. నాటకం


వైసీపీ ప్రభుత్వం తీరుపై సర్వత్రా విమర్శలు



ప్రత్యామ్నాయం చూడమంటే..

పింఛన్ల పంపిణీకి ప్రత్యామ్నాయ మార్గం చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఈసీ సూచించింది. కానీ వైసీపీ తన కుటిలబుద్ధిని ప్రదర్శించింది. గత నెలలో మండుటెండల్లో పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాల వద్దకు వెళ్లేలా చేసింది. తాజాగా బ్యాంకుల్లో పింఛన్ సొమ్ము జమ చేస్తామని చెప్పి.. మరో రకంగా ఇబ్బంది పెట్టి లబ్ధి పొందాలని చూస్తోంది. ఉరవకొండ మండలంలో మొత్తం 10,951 మంది లబ్ధిదారులు ఉన్నారు. నింబగల్లు, ఆమిద్యాల, రాకెట్లలో మాత్రమే బ్యాంకులు ఉన్నాయి. కౌకుంట్ల పంచాయతీలో 980మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ పింఛన్ బ్యాంకులో జమచేస్తే.. నగదు తీసుకునేందుకు 10 కి.మీ. దూరంలో ఉన్న రాకెట్ల బ్యాంకుకు వెళ్లాల్సి ఉంటుంది. బ్యాంకుల్లో పింఛన్ కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తుంది. ఆ రోజు ఇవ్వకపోతే మరుసటి రోజు వెళ్లాలి. ఇలా బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తే.. వచ్చిన పింఛన్ సొమ్ము ఆటో చార్జీలకే సరిపోతుందని బాధితులు వాపోతున్నారు.

వైసీపీ అక్కసు



సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని.. పింఛన్ల పంపిణీ ప్రక్రియ నుంచి వలంటీర్లను తొలగించాలని ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని వైసీపీ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోయింది. వలంటీర్లను విధులకు దూరం చేయడాన్ని ఏమాత్రం ఇష్టపడలేదు. దీనిని రాజకీయం చేస్తూ, పింఛన్ల పంపిణీని ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని గత నెలలో అధికార పార్టీవారు ప్రచారం చేశారు. ప్రస్తుతం బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామంటూ.. కొత్త నాటకానికి తెరలేపారన్న విమర్శలు వస్తున్నాయి.





మా ఊరిలో బ్యాంకులు లేవు..



మా ఊరిలో బ్యాంకులు లేవు. కిందటి నెల సచివాలయం వద్దకు వెళ్లి పింఛన్ తీసుకున్నాను. బ్యాంకులో జమ చేస్తే 10 కి.మీ. వెళ్లి డబ్బులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఈ నెల ఇళ్ల వద్ద పింఛన్ ఇస్తే బాగుండేది.

\- నాగమ్మ, మైలారంపల్లి

ఆగిపోయిన కోయంబత్తూరు ఎక్స్‌ప్రెస్

మూడు గంటలపాటు ప్రయాణికుల అవస్థలు

పామిడి, ఏప్రిల్ 30: గుంతకల్లు నుంచి కల్లూరు మీదుగా కోయంబత్తూరుకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు పామిడి సమీపంలోని 242/6 మైలురాయి వద్ద మంగళవారం నిలిచిపోయింది. సాంకేతిక సమస్యల కారణంగా దాదాపు మూడు గంటలపాటు రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎండవేడిమికి, ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరయ్యారు. కొందరు రైల్వే పట్టాలపై సేదదీరారు. ఎంతసేపటికి రైలు బయలుదేరుతుందో తెలియక మహిళలు బిక్కుబిక్కుమంటూ గడిపారు.



పామిడి స్టేషన్ గ్రామం వద్ద నిలిచిన రైలు

రైలు పట్టాలపైనే సేదదీరుతున్న ప్రయాణికులు

ఎవరు పిలిచినా వస్తాం.. నచ్చినోడికి ఓటేస్తాం !



ఎన్నికల వేళ గ్రామాల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. కొంతమంది ఏ పార్టీ నాయకులు పిలిచిన ర్యాలీ, ప్రచారానికి వెళ్తున్నారు. ఇదే విషయాన్ని కొందరు నేతలు వారిని ప్రశ్నిస్తే నా ఓటు నీకే వేస్తామన్నా అని చెబుతున్నారు. దీంతో అభ్యర్థులలో అయోమయం నెలకొంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు ఎటువంటి ఇబ్బంది ఉండరాదన్న ఉద్దేశ్యంతోనే కొందరు అలా ప్రవర్తిస్తున్నట్టు తెలుస్తోంది. టీడీపీ, వైసీపీ నాయకులు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో ఘనంగా స్వాగతం పలకాలన్న ఉద్దేశ్యంతో గ్రామస్థాయి నాయకులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రచారానికి రావాలని కోరుతున్నారు. దీంతో ఇరు పార్టీలకు జనం తండోపతండాలుగా వస్తున్నారు. దీంతో వీరు ఎవరికి ఓటు వేస్తారో అన్న అయోమయంలో పార్టీల నాయకులు, అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. కొంతమంది మాత్రం ప్రచారానికి వస్తాం, ఎన్నికల సమయంలో మాకు నచ్చిన వారికి ఓటు వేస్తామని నిక్కచ్చిగా చెబుతున్నారు. ఈక్రమంలో పోటీలో ఉన్న అభ్యర్థులు గ్రామాల్లో ప్రజలు నాడిని కనుక్కునేందుకు సొంత సర్వేలు చేయించుకుంటున్నారు.

- కొత్తచెరువు

ఖైదీలకు ఓటు హక్కు ఉంటుందా?



భారత రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన భారతీయపౌరులు ఓటు హక్కు ఉంటుంది. వివిధ కారణాల వలన జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఓటు హక్కు ఉంటుందా? ఉండదా అనే ప్రశ్న చాలా మందికి తలెత్తవచ్చు. అయితే ఖైదీలు కూడా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశముంది. వివిధ నేరాల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ప్రీవెంక్యూ డిటర్మినేషన్ పద్ధతిలో ఓటు వేయవచ్చు. నియోజకవర్గం పేరును సూచిస్తూ, తాము ఓటర్లమని, పోలింగ్ బూత్, ఓటరు క్రమ సంఖ్యతో ఓటు వేసే అవకాశం కల్పించాలని రాత పూర్వకంగా జైలర్‌ను కోరాలి. ఖైదీలు సూచించిన ప్రాంతాలనుంచి పోస్టల్ బ్యాలెట్‌ను తెప్పించి, ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

- కదిరిఅర్బన్

ఓటు వేయడానికి ఇవి చూపిస్తే చాలు



వచ్చే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా ప్రత్యామ్నాయంగా వివిధ గుర్తింపు పత్రాలు చూపించి ఓటు వేసే అవకాశాన్ని భారత ఎన్నికల కమిషన్ కల్పించింది. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులను ఎన్నికల కమిషన్ ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఓటు వేయడానికి ముందు పోలింగ్ కేంద్రంలో వారి గుర్తింపు నిర్ధారణకు పంపిణీ చేసిన ఓటరు స్లిప్పులు మాత్రమే చూపిస్తే సరిపోదు. ప్రభుత్వం జారీ చేసిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటు వేయవచ్చని అధికారులు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయ కార్డులు ఇవే..

ఆధార్‌కార్డు, ఎంఎన్‌ఆర్‌జీఏ, పాన్‌కార్డు, పోస్టాఫీసు లేదా బ్యాంకు జారీ చేసిన ఫొటో ఉన్న పాసు పుస్తకం, హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్‌కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, ఇండియన్ పాస్‌పోర్టు, ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్‌కార్డు, ఫొటోతో కూడిన పింఛన్ మంజూరు డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ కార్డు, దివ్యాంగుల ఐడీ కార్డు, ఎమ్మెల్యే, ఎంపీలు జారీ చేసిన అధికార గుర్తింపు పత్రం పోలింగ్ కేంద్రంలో చూపించి ఓటు హక్కును వినియో గించుకోవచ్చు.

- కొత్తచెరువు

పెనుకొండ విజయంలో...

గోరంట్లే కీలకం..!



గోరంట్ల పాతబస్టాండ్ కూడలిలో నీడనిస్తున్న మర్రిచెట్టు

గోరంట్ల, ఏప్రిల్ 30: పెనుకొండ నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించేది గోరంట్ల ఓటర్లే. నియోజకవర్గంలోని అన్ని మండలాలకంటే గోరంట్లలో అత్యధికంగా 64,434 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 32,050 మంది పురుషులు, 32,380 మంది మహిళలు, ఇద్దరు థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు. మండల ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపితే ఆ అభ్యర్థే గెలుస్తారని తెలుస్తోంది. పెనుకొండ నియోకవర్గంలో మొత్తం 265 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,35,986 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,17,952 మంది పురుషులు, 1,18,030 మంది మహిళలు, 4 థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు. మిగిలిన మండల్లాలో.. పెనుకొండ అర్బన్‌లో 22,138 మంది, రూరల్‌లో 23,075, సోమందేపల్లిలో 39,273, పరిగిలో 46,500, రొద్దంలో 40,568 మంది ఓటర్లు ఉన్నారు. గోరంట్ల మండలంలో అధిక శాతం ఓట్లు ఉండడంతో కీలకంగా మారుతోంది. దీంతో అన్నిపార్టీల అభ్యర్థులు గోరంట్ల మండలంపై ప్రత్యేక దృష్టి సారించడం ఆనవాయితీగా వస్తోంది.

అప్పట్లో కొందరికే ఓటు హక్కు..



ఇప్పుడంటే దేశంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు వేస్తున్నారు కానీ ఒకప్పుడు అలా ఉండేది కాదు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తొలిరోజుల్లో ఉద్యోగులు, చదువుకున్నవారు, భూస్వాములకు మాత్రమే ఓటు వేసే అవకాశం ఉండేది. అప్పట్లో మండలాలను ఫిర్కాలుగా పిలిచేవారు. ప్రస్తుత వీఆర్‌ఓలకు బదులుగా అప్పుడు వీఎం(విలేజ్ మేజిస్ట్రేట్)లు ఉండేవారు. వీరివద్దే ఓటర్లుగా నమోదు చేయించుకునే వారు. ప్రత్యక్ష పద్ధతిలో బహిరంగసభలో చేతులెత్తి ఓటు హక్కును వినియోగించుకునే వారు. 1952, 1951లో ఒక అభ్యర్థికి ప్రత్యేకంగా ఒక పెట్టె ఏర్పాటు చేసేవారు. వాటిలోనే ఓటువేసేవారు. అనంతరం అభ్యర్థులు ఎందరైనా ఒకే పెట్టెలో ఓటువేసే విధానం వచ్చింది. బ్యాలెట్ ఓటు విధానం అనంతరం, ఈవీఎంలను ఎన్నికల్లో వినియోగించడం ప్రారంభమైంది.

- హిందూపురం



మల్లయ్య కాలనీ

ఆ కాలనీ అనంతపురం నగరానికి కూత వేటు దూ రంలో ఉంది.. అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో ఉంది. రూరల్ మండలంలోని మల్లయ్యకాలనీ (అన్నెఫెర్రర్ కాలనీ)లో కనీస సౌకర్యాలు లేక సతమతమవుతున్నారు. గత ఎన్నికలకు ముందు రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి కుటుంబికులు ప్రచారానికి వెళ్లినప్పుడు సమస్యలన్నీ పరిష్కరిస్తామ ని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గె లిచాక ఐదేళ్లలో ఒక్కసారంటే ఒక్కసారి కూడా కాలనీ వైపు తొంగిచూడలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లయింది.. మళ్లీ రాలేదు..!

- అభివృద్ధికి నోచుకోని మల్లయ్య కాలనీ
- గత ఎన్నికల్లో అభివృద్ధికి హామీలు
- మౌలిక వసతులు లేక అవస్థలు
- రాప్తాడు ఎమ్మెల్యేపై కాలనీవాసుల ఆగ్రహం





కాలనీలోని ప్రధాన రోడ్డు

అనంతపురం రూరల్

అక్కడ ఉన్న వారంతా పేదలే. కూలి పనులకు వెళితే తప్పా పూట గడవని పరిస్థితి. కాలనీ ఏర్పడి దశాబ్ద కాలం గడుస్తున్నా కనీస మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నారు. అనంతపురం రూరల్ మండలం చిన్నంపల్లి పంచాయతీ మల్లయ్యకాలనీ (అన్నె ఫెర్రర్ కాలనీ) దుస్థితిని పట్టించుకునే నాథుడే లేడు. నగరానికి ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్నా అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో ఉంది. కాలనీలో దాదాపు 200 కుటుంబాలకు పైగా నివాసముంటున్నాయి. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా తన కుటుంబ సభ్యురాలు ఒకరిని పంపి ప్రచారం చేయించారు. వైసీపీ అధికారంలోకి వస్తే కాలనీ రూపురేఖలు మారుస్తామని, రోడ్లు, కాలువలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని హామీలు ఇచ్చారు. దీంతో స్థానికులు వైసీపీ అధికారంలోకి వస్తే కాలనీ అభివృద్ధి చెందుతుందన్న ఆశతో ఓట్లు వేసి గెలిపించారు. అంతంటితో సరి. ఆ తరువాత హామీలు ఇచ్చిన దూతకానీ, రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి కానీ ఐదేళ్లలో ఒక్కసారంటే ఒక్కసారి కూడా కాలనీ వైపు చూసింది లేదంటున్నారు స్థానికులు. ఇటీవలే కాలనీలో ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే కాలనీ ఇలా ఉందని తాను అనుకోలేదని.. ఈసారి గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారని కాలనీ వాసులు చెబుతున్నారు. తమను ఓటర్లుగా మాత్రమే చూస్తున్నార తప్పా, కాలనీ అభివృద్ధి గురించి పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాలనీ ఏమాత్రం మారలేదు

మేము కాలనీ ఏర్పాటయినప్పటి నుంచి ఉంటున్నాం. అప్పటికి ఎలా ఉందో..ఇప్పటికీ అలాగే ఉంది. ఏమాత్రం మార్పు లేదు. రాత్రివేళల్లో విషపురుగులు సంచరిస్తున్నాయి. మరో చోటుకు వెళ్లలేము. మా కష్టాలు మాకు తప్పవు. ఎన్నికల సమయంలో నాయకులు రావడం హామీలు ఇవ్వడం తప్పా చేసిందేమీ లేదు. కాలనీలోకి వచ్చేందుకు బ్రిడ్జి, రోడ్లు, కాలువలు వేయిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఏదీ జరగలేదు.

- రమాదేవి, కాలనీవాసి



ఒక్క హామీ కూడా నెరవేరలేదు



గత ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరుడు చందు భార్య కాలనీలో ప్రచారం నిర్వహించారు. అప్పుడు కాలనీలో రోడ్లు, కాలువలు, ఇతర సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని చెప్పివెళ్లారు. ఇంతవరకు ఒక్క హామీ కూడా నెరవేరలేదు. అంతేకాదు.. కాలనీలో టీడీపీ సానుభూతిపరులెవరైనా బియ్యం కోసం ఒక్కటి రెండు రోజులు ఆలస్యం అయితే డీలర్ బియ్యం అయిపోయాయంటూ వెనక్కు పంపించేస్తున్నారు. కాలనీలో పరిస్థితి అధ్వానంగా ఉంది. వైసీపీ నాయకులు చెప్పినట్లు వింటే సరి లేదంటే గొడవలు సృష్టించేస్తారు. ఈ గొడవలు పడలేక చాలా మంది వెళ్లిపోయారు.

- గుల్జారమ్మ, కాలనీవాసి





కాలనీలో లేని రోడ్డు కాలువలు

ఏ నాయకుడూ రాలేదు

కాలనీలో ఎనిమిదేళ్లుగా నివాసముంటున్నాం. ఏనాడూ.. ఏ నాయకుడు కాలనీ వైపు వచ్చింది లేదు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే మేము కనిపిస్తున్నాం. ఓట్లు వేయించుకుని గెలిచిన నాయకులకు మేము..మా కాలనీ కనిపించదు. రోడ్లు, కాలువలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఏడాది కిందట వర్షం వచ్చినప్పుడు ఇళ్లలోకి నీరు చేరాయి. ఎవరూ ఇటువైపు వచ్చి మా సమస్యలు అడిగింది లేదు. కాలనీ వాసులమంతా వారం పదిరోజులు ఎన్ని ఇబ్బందులు పడ్డామో మాకే తెలుసు.

- అరుణ, కాలనీవాసి

కలగా మిగిలిన రింగ్‌రోడ్డు



రింగ్‌రోడ్డు గురించి అధికారులతో టీడీపీ నాయకుల చర్చ(ఫైల్)

టీడీపీ పాలనలో మడకశిర పట్టణాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ఔటర్ రింగ్ రోడ్డు పనులు ప్రారంభించారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పనులు నిలిచిపోయాయి. టీడీపీ పాలనలో నాయకులు ఎంతో కష్టపడి పట్టణం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించడానికి రైతుల నుంచి 15 ఎకరాల భూమి సేకరించారు. చౌటిపల్లి గ్రామ సమీపంలో రోడ్డు పనులు కూడా ప్రారంభించారు. ఆ సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ దాని గురించి పట్టించుకోలేదు. దీంతో ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం తమకు కలగానే మిగిలిందని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

-మడకశిర రూరల్

పెరిగిన జంపింగ్‌లు



సార్వత్రిక ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు అంటూ కార్యకర్తలు, నాయకుల జంపింగ్‌లు అధికమయ్యాయి. పార్టీలో చేరే వారికి నిత్యం కండువాలు కప్పడానికే అభ్యర్థులకు సగం సమయం సరిపోతోంది. ప్రధాన పార్టీలకు చెందిన కొందరు స్థానిక నాయకులు రాజకీయంగా క్రియాశీలకంగా లేని అవతలి పార్టీ కార్యకర్తలను సైతం తమ పార్టీ అభ్యర్థులు, నాయకుల వద్దకు తీసుకెళ్లి వారి గురించి గొప్పలు చెప్పి పార్టీ కండువాలు వేయించేస్తున్నారు. ఇప్పటివరకు ఉన్నపార్టీని వీడి హఠాత్తుగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలతో అవతలి పార్టీలో చేరుతుండటంతో ఆయా అభ్యర్థులు సైతం ఆశ్చర్యపోతున్నారు. మరోవైపు వీరందరూ కోవర్టులేమోనన్న భయం కూడా వారిని వెంటాడుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ధర్మవరం పట్టణంతోపాటు మండలాల్లో కూడా చేరికలు ఎక్కువగా జరుగుతున్నాయి.

- ధర్మవరం

అన్నన్నా!

నోటికాడ కూడు లాగేశారు..!



బళ్లారి బైపాస్ సర్కిల్‌లోని అన్న క్యాంటీన్ భవనం

ఇక్కడ కనిపిస్తున్న భవనం బళ్లారి బైపాస్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్. టీడీపీ హయాంలో నిత్యఅన్నదాన సత్రంలా కళకళలాడింది. ఎంతో మంది ఆకలి తీర్చింది. చుట్టుపక్క ప్రాంతాలు, వివిధ పనులపై నగరానికి వచ్చిన వారు వచ్చి ఈ క్యాంటీన్‌లో ఐదు రూపాయలకే కడుపు నిండా అన్నం తినేవారు. వందల మంది కూలీలు, హమాలీలకు బైపాస్ సర్కిల్ కేంద్ర బిందువు. వారందరికీ ఈ క్యాంటీన్ కడుపునింపింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ క్యాంటీన్‌ను మూసివేశారు. ప్రస్తుతం ఆ భవనం మున్సిపాలిటీ అవసరాల కు మాత్రమే ఉపయోగపడుతోంది. భవనం అద్దాలు పగిలిపోయాయి. భవనం చెత్త చెదారం, దుమ్ము, ధూళీతో నిండిపోయింది. ఎంతో మందికి అన్నం పెట్టిన క్యాంటిన్ మూసివేయడం అంటే పేదల నోటి కాడ..కూడు లాగేసుకోవడమేనని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- అనంతపురం రూరల్

యువతే భవిత

హిందూపురం

దేశ అభివృద్ధి, భవిష్యత్తును నిర్దేశించేది ఆ దేశ యువతే. బాధ్యతాయుతమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో వీరిదే కీలక పాత్ర. ప్రపంచీకరణకు ముందు మేలైన సమాజ నిర్మాణంలో కూడా యువత చైతన్యవంతంగా ఉండేది. ఇందు కోసం యువజన సంఘాలు సైతం ఏర్పడ్డాయి. అందుకే ఎన్నికల సమయంలో వివిధ పార్టీల అభ్యర్థులు వీరి మద్దతు కోసం తీవ్రంగా ప్రయత్నించేవారు. కాలక్రమేణ యువజన సంఘాలు కనుమరుగయ్యాయి. ఈక్రమంలోనే చైతన్యానికి మారుపేరుగా నిలిచిన యువతను కొన్ని పార్టీలు, కొందరు నాయకులు తమ రాజకీయ ప్రయోజనాలు, ఓట్ల కోసం వ్యసనాలకు బానిసలుగా మారుస్తున్నారు.

- ఎన్నికల్లో వీరిదే కీలకపాత్ర
- ఎటువైపు మొగ్గితే అటువైపే విజయం
- గత ఐదేళ్లలో యువజన సంఘాలు నిర్వీర్యం
- ఓట్ల కోసం వ్యసనాలకు బానిసలుగా మారుస్తున్న పార్టీలు

వారంటే ప్రత్యేక గౌరవం



ఒకప్పుడు సామాజిక రుగ్మతలపై యువజన సంఘాలు నిరంతరం కార్యకలాపాలు నిర్వహించేవారు. అక్షరాస్యత శాతాన్ని పెంచడంతోపాటు ఆసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే యువకుల్లో మార్పు తీసుకురావడంలో, స్థానిక సంస్థల పరిష్కారానికి కృషిచేసేవి. వీటితోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించేవారు. శారీరక పటుత్వం కోసం వ్యాయామశాలలు నిర్వహించేవారు. దాదాపు అన్ని ప్రాంతాల్లో యువజన సంఘాలు కొనసాగుతుండేవి. అనంతర కాలంలో ప్రాచుర్యం పొందిన క్రికెట్ పోటీలు నిర్వహిస్తూ సత్సంబంధాలు నడిపేవారు. అదే సమయంలో చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించేవారు. పల్లెల్లో పట్నాల్లో జాతరలో సామూహిక కార్యక్రమాల్లో వలంటీర్లుగా సేవలందించేవారు. ప్రభుత్వాలు కూడా యువజన సంఘాలతో కలిసి పలు కార్యక్రమాలు నిర్వహించేవి. దీంతో యువజన సంఘాల సభ్యులకు సమాజంలో ప్రత్యేక గౌరవం ఉండేది. విద్యాసంస్థల్లో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్‌లో కూడా అధికంగా చేరేవారు. కానీ నేడు ఇలాంటివి కనుమరుగవుతున్నాయి.

యువజన సంఘాలు కనుమరుగు

జీవన అలవాట్లు, ఆలోచనవిధానాలు, సమాజ పోకడలు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా యువజన సంఘాలు కనుమరుగవుతున్నాయి. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో అందరిచేతుల్లో స్మార్ట్‌ఫోన్‌లు వచ్చి చేరాయి. దీంతో కొందరు విజ్ఞానం పొందుతుండగా మరికొందరు పెడత్రోవపడుతున్నారు. ప్రభుత్వాలు కూడా యువజన శాఖను పూర్తి నిర్లక్ష్యం చేయడంతో ఆశాఖ ద్వారా నిర్వహించాల్సిన కార్యకలాపాలకు స్వస్తి పలికారు. గడచిన ఐదేళ్లలో యువజన సంఘాలను పూర్తిగా నిర్వీర్యం చేశారు.

నిలదీతే పరిష్కారం

యువతను పెడత్రోవ పట్టిస్తూ స్వప్రయోజనాలు చూసుకుంటున్న నాయకులను నిలదీయడమే ఇందుకు పరిష్కారమని సామాజికవేత్తలు అంటున్నారు. ఓటును వజ్రాయుధంగా వాడాలని సూచిస్తున్నారు. ఫిరాయింపులు, మద్యం పంపిణీ, గొడవలకు యువతను ముందుంచడం పై ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. ఈ ఐదేళ్లలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కడా కనిపించలేవు. దీంతో అలాంటి నాయకులు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు నిలదీయాలని సూచిస్తున్నారు. ఎన్నికల ప్రభావంతో యువతను వ్యసనాలకు బానిసలుగా మారుస్తున్న నాయకులకు ఓటుద్వారా బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గెలుపోటముల్లో కీలకం

ఎన్నికల సమయంలో అభ్యర్థుల గెలుపోటములు యువతపైనే ఆధారపడి ఉంటాయి. ఎందుకంటే ఎన్నికల్లో యువత ఓటు శాతం అధికంగా ఉంది. దీనివల్ల వారు ఎటువైపు మొగ్గు చూపితే అటువైపు విజయం సాధించే అవకాశం ఉంటుంది. దీంతో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు యువతపై ఓ కన్నేసి వారి ఓట్లను పొందేందుకు మార్గాలను అన్వేషిస్తున్నాయి.

ఎన్నికల్లో అధికారులే కీలకం

జిల్లా, గ్రామస్థాయి వరకు ప్రధానపాత్ర.. వారి పర్యవేక్షణలోనే ఎన్నికల సమరం

ధర్మవరం

సార్వత్రిక ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడంలో అధికారుల పాత్ర కీలకం. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ అధికారులదే కీలక పాత్ర. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ పర్యవేక్షణకు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రధాన ఎన్నికల అధికారిని సంప్రదిస్తుంది. ఆయన పర్యవేక్షణలోనే ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో జిల్లా, నియోజకవర్గ, మండలం, గ్రామస్థాయిలో పనిచేసే అధికారులు వివరాలు ఇలా...

జిల్లా ఎన్నికల అధికారి

ప్రధాన ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ప్రతి జిల్లాకు ఎన్నికల అధికారి ఉంటారు. పాలనాధికారి(కలెక్టర్)ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమలు చేయడంలో కలెక్టర్ ప్రధాన పాత్ర పోషిస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేస్తారు.

రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ)

ఎన్నికల నిర్వహణకు కేంద్రం రిటర్నింగ్ అధికారిని నియమిస్తుంది. ఈ అధికారి సంబంధిత నియోజకవర్గాలను పర్యవేక్షిస్తారు. నామినేషన్ ప్రక్రియ, తుది జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించడానికి సిబ్బంది నియామకం. వారికి శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి అంశాలు ఆర్‌ఓ పర్యవేక్షణలోనే జరుగుతాయి.

సెక్టోరియల్ అధికారి

8-10 పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించడానికి సెక్టోరియల్ అధికారులను నియమిస్తారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. అవసరమైతే పరిస్థితులకు అనుగుణం గా ఆయా చోట్ల 144 సెక్షన్ విధించే అధికారి ఆయనకు ఉంటుంది.

ఓటర్ల నమోదు అధికారి

ఓటర్ల నమోదు అధికారి ప్రతి నియోజకవర్గ స్థాయిలో ఉంటారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునేవారు, జాబితాలో పేర్లు, ఫొటోలు తప్పుగా ఉన్నవారంతా ఆయనను సంప్రదించాలి. ఆయన పర్యవేక్షణలోనే సిబ్బంది ఓటరు జాబితానతయారు చేస్తారు.

ప్రిసైడింగ్ అధికారి

ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రిసైడింగ్ అధికారి(పీఓ) ఉంటారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించి, అనంతరం వాటిని స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చేవరకు వీరిదే బాధ్యత. వీరితో పాటు సహాయ ప్రిసైడింగ్ అధికారు(ఏపీఓ)లు ఉంటారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని కార్యకలాపాలు పీఓ పర్యవేక్షణలో జరుగుతాయి.

సూక్ష్మ పరిశీలకులు

ఎన్నికలు జరిగిన తీరు, పర్యవేక్షణపై నివేదిక రూపొందించి కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించడానికి సూక్ష్మ పరిశీలకులను ఏర్పాటు చేస్తారు. ప్రతి మండలానికి ఒకరు ఉంటారు. వారంతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తారు.

బూత్ లెవల్ అధికారి (బీఎల్‌ఓ)

ప్రతిపోలింగ్ కేంద్రానికి బూత్ లెవల్ అధికారి ఉంటారు. కొత్తగా ఓటరు జాబితాలో చేరే వారికి ఫాం-6, తొలగింపునకు ఫాం-7, తప్పుల సవరణకు అవసరమైన ఫారాలు ఇవ్వడం, అర్హులైన వారంతా ఓటు నమోదు చేసుకునేలా చూడటం, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు ప్రతి పాదించడం, ఓటర్ల జాబితా ప్రదర్శన, కేంద్రాల్లో మార్పులకు బీఎల్‌ఓలు పనిచేస్తుంటారు.



గొంతెండుతోంది

ఉరవకొండలో 20 రోజులకోసారి నీటి సరఫరా

ఉరవకొండ, ఏప్రిల్ 30: పట్టణంలో తాగునీటి సమస్య జటిలమైంది. 20 రోజులకు ఒక్కసారి నీరు సరఫరా చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉరవకొండలో 45 వేల మంది నివసిస్తున్నారు. 20 వార్డులు ఉన్నాయి. పట్టణానికి నింబగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు , పీఏబీఆర్ డ్యాం నుంచి నీటి సరఫరా చేస్తున్నారు. ఉరవకొండతో పాటు ఏడు గ్రామాలకు తాగునీటిని అందించే సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు అడుగంటిపోయాయి. బండల ట్యాంకులో మీటరు ఎత్తులో మాత్రమే నీరు నిల్వ ఉంది. ఈ నీటిని ట్యాంకుల్లోకి మోటార్లు వేసి రెండు గ్రామాలకు నేరుగా సరఫరా చేస్తున్నారు. పీఏబీఆర్ నుంచి రోజుకు 18లక్షల లీటర్లకుగానూ సగం కూడా సరఫరా కావడం లేదు. ఆ వచ్చిన నీటిని వజ్రకరూరు, విడపనకల్లు మండలాల్లోని గ్రామాలకు సరఫరా చేయాల్సి ఉంది. ప్రస్తుతం 20రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా అవుతోంది. అది కూడా అరకొరగా వదులుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.800 చెల్లించి ట్యాంకర్ నీటిని కొనుక్కోవాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. బోర్లు వేసినా ఆశించిన మేర నీరు పడలేదు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో మూడు బోర్లు వేసినా 4 ఇంచులు మాత్రమే వస్తోంది. వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో సమస్య తీవ్రమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.


ఎండిపోయిన నింబగల్లు చెరువు

ఒంటికాలిపై నిరసన

తాగు నీటి కోసం 11వ వార్డుకు చెందిన శివ అనే వ్యక్తి ఒంటి కాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేశాడు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలు మెడలో వేసుకుని ప్లకార్డులు చేత్తో పట్టుకుని ఆందోళనకు దిగాడు. 20రోజులు అయినా అధికారులు తాగు నీరు సరఫరా చేయడం లేదన్నారు. నీటి సమస్యను విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. విచ్చలవిడిగా కుళాయిలు వేయడం వల్ల నీరు సక్రమంగా రావడం లేదన్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.



రెచ్చిపోతున్న వైసీపీ అల్లరి మూకలు

బుక్కపట్నం, ఏప్రిల్ 30: పుట్టపర్తి నియోజకవర్గంలో వైసీపీ నాయకుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అండతో వైసీపీ అల్లరి మూకల రోజురోజుకు రెచ్చిపోతున్నాయి. మండలంలోని పాముదుర్తి గ్రామానికి టీడీపీ ప్రచార వాహనం మంగళవారం వెళ్తుండగా గరుగుతండా సమీపంలో వైసీపీ నాయకులు అడ్డుకుని దాన్ని ధ్వంసం చేశారు. అంతేకాక డ్రైవర్ సెల్‌ఫోన్ లాక్కుని నానా హంగామా చేశారు. ఇటువైపు వస్తే చంపేస్తామంటూ బెదిరించారు.


ధ్వంసమైన ప్రచార వాహనం

ఇసుకే బంగారం..!


ఎద్దుల బండ్లపై ఇసుక తరలింపు (ఫైల్)

- ట్రాక్టర్ ఇసుక రూ.3 వేలు
- సొంతింటి కలకు అడ్డంకిగా మారిన వైనం
- నిబంధనల పేరుతో పేదలకు ఇక్కట్లు

చిలమత్తూరు, ఏప్రిల్ 30: వైసీపీ పాలనలో ఇసుక బంగారంలా మారిపోయింది. దీంతో సామాన్యులు ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బండెడు ఇసుక కావాలన్నా రూ. 1200 నుంచి రూ. 1500ల ఖర్చు చేసుకోవాల్సి వస్తోంది. అదీ కూడా ప్రభుత్వ అనుమతితోనే. లేదంటే ఇంటి వరకు ఇసుక రాదు. ఈ అనుమతుల కారణంగా వైసీపీ పాలనలో ఇసుక ధరలు మరింత ప్రియం అయ్యాయని ప్రజలు వాపోతున్నారు.

ట్రాక్టర్ ఇసుక రూ.3 వేలు

గతంలో ట్రాక్టర్ ఇసుక ధర రూ. వెయ్యి రూపాయలు ఉండేది. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఇసుకను తెచ్చుకునే వీలుండేది. కానీ ఇప్పుడు అనుమతుల పేరుతో కాలయాపన చేయడం, రవాణాకు నిర్దిష్ట సమ యాన్ని కేటాయించి అనుమతులు ఇవ్వడంతో ఇబ్బందులు తలెత్తుతున్నా యి. ఈ కారణాలతో ట్రాక్టర్ల యజమానులు కూడా విపరీతంగా ధరలు పెంచేశారు. ఒక ట్రాక్టర్ ఇసుక ధర రూ. 3 వేల నుంచి రూ. 4 వేలు వరకు పలుకుతోంది. గ్రామ సచివాలయాల్లో ఇసుక అనుమతులు వైసీపీ నాయకులకే ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఇసుక రవాణానే వృత్తిగా...

వైసీపీ పాలనలో ఇసుక ధరలు విపరీతంగా పెరగడంతో కొందరు ఇసుక రవాణానే వృత్తిగా ఎంచుకుంటున్నారు. అన్నింటికంటే మంచి ఆదాయ వనరుగా ఇసుక రవాణా మారడంతో ఎక్కువ మంది దీని వైపే మొగ్గు చూపుతున్నారు. ఈక్రమలోనే కొత్త, కొత్త ట్రాక్టర్లు, టిప్పర్లు పెరిగిపోతున్నా యి. సొంతంగా ఇళ్లు కట్టుకోవాలన్నా కూడా ఇసుక కొరత తీవ్రంగా ఉంది. అధికారులు మాత్రం అక్రమ రవాణాను అరికట్టేందుకుకే నిబంధనలు కఠినం చేశామంటూ ఇసుకకు కృత్రిమ డిమాండ్ సృష్టిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఉద్యోగుల బరితెగింపు..!

వైసీపీ సేవలో సెబ్ హెడ్‌కానిస్టేబుల్, పోస్టల్ బీపీఎం

బుక్కపట్నం, ఏప్రిల్ 30: నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఎన్నికల ప్రచారంలో కొందరు ప్రభుత్వం ఉద్యోగులు తరిస్తున్నారు. ఇందుకు మండలంలోని పాముదుర్తి గ్రామంలో మంగళవారం జరిగిన సంఘటనే ఉదాహరణ. ఆ గ్రామంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాముదుర్తికి చెందిన సెబ్ హెడ్‌కానిస్టేబుల్ రాజగోపాల్ ఇంటి ముందు షామియానాలు ఏర్పాటు చేసి, ప్రచారం చేశారు. కానిస్టేబుల్ రాజగోపాల్ ప్రచారంలో పాల్గొనడమే కాకుండా, పార్టీ కార్యకర్తలా ప్రవర్తిస్తూ హల్‌చల్ చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లఘించి ప్రచారంలో పాల్గొన్న రాజగోపాల్‌ను సస్పెండ్ చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు.


ప్రచారంలో పాల్గొన్న సెబ్ హెడ్‌కానిస్టేబుల్

తపాలా ఉద్యోగి..


వైసీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పోస్టల్ ఉద్యోగి పాటిల్ సుబ్బారెడ్డి

అనంతపురం: కూడేరు మండలం ఉదిరిపికొండ గ్రామానికి చెందిన తపాల ఉద్యోగి పాటిల్ సుబ్బారెడ్డి వైసీపీ సేవలో తరిస్తున్నాడు. ఈయన గ్రామంలోనే బీపీఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన హుస్సేన్‌ను తిరిగి వైసీపీలోకి రప్పించాడు. ఆయనకు వైసీపీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

మనోళ్లంతా యాడాడ ఉండారో..?



మనోళ్లంతా యాడాడ ఉండారో రేంత ఎతకండప్పా అంటూ గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు.. కార్యకర్తలను పురమాయిస్తున్నారు. ప్రస్తుత ఎన్నికలు ప్రధాన పార్టీలకు జీవన్మరణ సమస్యగా మారడంతో క్షేత్రస్థాయిలో నాయకులు ప్రతి ఓటును కీలకంగా భావిస్తున్నారు. ఈక్రమంలోనే గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు పొట్టకూటి కోసం వలస వెళ్లిన ఓటర్ల కోసం వెదుకులాట ప్రారంభించారు. మడకశిర నియోజకవర్గంలో దాదాపు 20శాతం మంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. గ్రామంలో ఎవరు ఉన్నారు? ఎవరు వలస వెళ్లారు అన్న విషయాన్ని వలంటీర్లు ఇంటింటి సర్వే ద్వారా ఇదివరకే గుర్తించారు. ఆ జాబితా పట్టుకుని స్థానిక నాయకులు పోలింగ్ తేదీ సమయానికి వలస ఓటర్లను రిప్పించే యత్నాలు చేస్తున్నారు. వారికి ప్రయాణ చార్జీలు, ఇతర ఖర్చులు కూడా భరించడానికి నాయకులు వెనుకాడటంలేదని సమాచారం.

- మడకశిర రూరల్

సంచలనాలకు మారుపేరైన తాడిపత్రి నియోజకవర్గానికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఫ్యాక్షన్ పేరు చెబితే తాడిపత్రి గుర్తుకు వచ్చేటంత స్థాయిలో పేరుమోసింది. ప్రత్యర్థులను భౌతికంగా మట్టుబెట్టడమే కాదు ఆర్థికంగా దెబ్బతీయడానికి వ్యవసాయ తోటలను నరికి తమ పైశాచికత్వాన్ని ప్రదర్శించిన తీరు ఇక్కడ మాత్రమే ఉంది. కాలక్రమంలో ఫ్యాక్షన్ వీడి ప్రగతివైపు అడుగులు పడ్డాయి. వందలాది పరిశ్రమలతో వేలాది మందికి ఉపాధినిచ్చే ప్రాంతంగా నిలిచింది. ఇక్కడ ఆధ్యాత్మిక కేంద్రాలకూ కొదవలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ నిర్ణయాలతో వందలాది పరిశ్రమలు మూతపడ్డాయి.


మూతపడ్డ డోలమైట్ పరిశ్రమ

పరిశ్రమల ఖిల్లా

- ఒకప్పుడు అభివృద్ధికి కేరాఫ్ తాడిపత్రి
- ప్రస్తుతం పరిశ్రమల్లో కరువైన ఉపాధి
- వెంటాడుతున్న తాగునీటి సమస్య
- పదివేల ఎకరాల్లో సాగుకు చుక్కనీరు కరువు


మూతపడ్డ గ్రానైట్ పరిశ్రమ

తాడిపత్రి

రాష్ట్రంలోనే తాడిపత్రికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. మొట్ట మొదటిసారిగా ఫ్యాక్షన్ పురుడుపోసుకున్నది ఈ ప్రాంతంలోనే. దీంతో ఈ ప్రాంతం అంటేనే దేశంలోని పలు రాష్ట్రాల్లో కూడా ప్రత్యేకత ఉంది. కాలక్రమేణా అందరూ చదువుకొని విద్యావంతులు కావడంతో ఫ్యాక్షన్ వీడి ప్రగతివైపు అడుగులు వేయడంతో పెను మార్పులు వచ్చాయి. ఈ ప్రాంతం కూడా అభివృద్ధి వైపు అడుగులు వేసింది. గ్రానైట్, నాపరాళ్లతో పాటు పలు పరిశ్రమల ఏర్పాటుతో అందరికి ఉపాధి లభించింది. చేనేత రంగంమీద ఆధారపడి వేలాదిమంది జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో అత్యంత ప్రసిద్ధి గాంచిన ఆలయాలు ఉన్నాయి. బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం, చింతల వెంకటరమణస్వామి ఆలయం, ఆలూరుకోన రంగనాథస్వామి ఆలయం, కోటకొండ ఆంజనేయస్వామి ఆలయం, యాడికిలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం, పెద్దపప్పూరులోని అశ్వత్థ నారాయణస్వామి ఆలయాలు ఉన్నాయి. 30 ఏళ్ల క్రితం పెన్నానది వర్షాకాలంలో బాగా పారేది. నియోజకవర్గం మొత్తం 3,08,414.14 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. నియోజకవర్గ జనాభా 3,65,662గా ఉంది.

ఆ పేరు ఎలా వచ్చిందంటే..

పూర్వం తాడిపత్రిలో ఎక్కడ చూసినా తాటి చెట్లు విపరీతంగా ఉండేవి. అప్పట్లో ప్రజలు తాటి ఆకుల పట్టలతో గుడిసెలు నిర్మించుకొని నివసించే వారని చరిత్ర చెబుతోంది. శ్రీరామచంద్రుడు విశ్వామిత్రుడు యాగం కోసం తాటివనం గుండా (తాడిపత్రి మీదుగా) వెళుతుండగా తాటకి అనే రాక్షసి అడ్డుగా వచ్చింది. దీంతో తాటకిని సంహరించిన ప్రాంతం కావడంతో తాటిపరిధి కాగా రానురాను తాళ్లపరిధిగాను బ్రిటీష్ కాలంలో తాడ్రిపర్తిగా మారి కొన్నేళ్లకు తాడిపత్రిగా పేరు గాంచింది.

తొలి ఎమ్మెల్యే చల్లా



తాడిపత్రి నియోజకవర్గం ఏర్పడిన మొదటి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా చల్లా సుబ్బరాయుడు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసి సీపీఐ అభ్యర్థిపై విజయం సాధించారు. చల్లా సుబ్బరాయుడు తాడిపత్రి మండలం చల్లవారిపల్లి గ్రామ నివాసి. ఈయనది వ్యవసాయ కుటుంబం. ఎంతో సౌమ్యుడిగా గుర్తింపు పొందిన ఆయన కాంగ్రెస్ పార్టీ తరఫున మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1955, 1967, 1972లో జరిగిన ఎన్నికల్లో చల్లా విజయం సాధించారు. 1972జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి మంచాల కేశవరెడ్డిపై 7,936 అత్యధిక మెజార్టీ సాధించారు. రెండోసారి 1962లో జరిగిన ఎన్నికల్లో చల్లాపై స్వతంత్ర్య అభ్యర్థి సి. కులశేఖర్‌రెడ్డి విజయం సాధించారు.

బండలే అండ

తాడిపత్రి గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమల బండలే ఇక్కడి ప్రజల ప్రధాన జీవనాధారంగా ఉన్నాయి. వందల సంఖ్యలో పరిశ్రమలు ఉండడంతో ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఉపాధి కోసం వేల సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. తాడిపత్రి సమీపంలోనే నంద్యాల జిల్లాలోని కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లి గ్రామాల సరిహద్దుల్లో నల్లబండల గనులు అత్యధికంగా విస్తరించి ఉన్నాయి. వీటితోపాటు సిమెంట్ పరిశ్రమలైన అల్ట్రాటెక్, పెన్నాపరిశ్రమ, సాగర్‌సిమెంట్స్, ఇతర పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో వేలాదిమంది ఉపాధి పొందుతున్నారు.


బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం


యాడికి చెన్నకేశవ స్వామి ఆలయం

దర్శనీయ స్థలాలు

విజయనగర రాజుల కాలంలో నిర్మించిన ప్రసిద్ధ శైవక్షేత్రం బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం రెండో కాశీగా విరాజిల్లుతోంది. ఆలయం పక్కనే రుద్రభూమి, గంగానది ఉండడం కేవలం కాశీలో మాత్రమే చూస్తాం. దేశంలోనే మరెక్కడా లేనివిధంగా బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం పక్కనే రుద్రభూమి, పెన్నానది ఉండడంతో రెండో కాశీగా చెబుతుంటారు. ఆలయంలో స్వామివారి లింగం చుట్టూ కాలంతో సంబంధం లేకుండా ఎప్పటికి నీరు ఉబికి వస్తుండడం ఇక్కడి విశేషం. ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రమైన చింతల వెంకటరమణస్వామి ఆలయం కూడా తాడిపత్రిలో ఉంది. ఇక్కడి వెంకటేశ్వరస్వామిని ఒక్కసారి దర్శించుకుంటే చింతలు తీరుస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. మరో వైష్ణవ క్షేత్రంగా ఆలూరు గ్రామ సమీపంలో ప్రకృతి ఒడిలో శ్రీదేవిభూదేవి సమేత ఆలూరు కోన విరాజిల్లుతోంది. పెద్దపప్పూరు సమీపంలో ఉన్న మరో పురాతన ఆలయం అశ్వత్థనారాయణస్వామి చక్రస్థాపిత భీమలింగేశ్వరస్వామి ఆలయం. మాఘమాసంలో జరిగే స్వామివారి తిరుణాల అత్యంత ప్రసిద్ధిగాంచింది. ఈ తిరుణాలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి లక్షలాదిమంది భక్తులు తరలివస్తారు.

సంవత్సరం	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	అధిక్యం
1955	చల్లా సుబ్బరాయుడు	కాంగ్రెస్	వాల్మీరెడ్డి ఆదినారాయణరెడ్డి	సీపీఐ	6331
1962	సి. కులశేఖర్‌రెడ్డి	ఇండిపెండెంట్	చల్లా సుబ్బరాయుడు	కాంగ్రెస్	5667
1967	చల్లా సుబ్బరాయుడు	కాంగ్రెస్	వీకే ఓబిరెడ్డి	ఇండిపెండెంట్	3773
1972	చల్లా సుబ్బరాయుడు	కాంగ్రెస్	మంచాల కేశవరెడ్డి	ఇండిపెండెంట్	7936
1978	దిద్దేకుంట వెంకటరెడ్డి	కాంగ్రెస్	మంచాల కేశవరెడ్డి	జేఎన్‌పీ	5513
1983	ముత్యాల కేశవరెడ్డి	ఇండిపెండెంట్	జేసీ దివాకర్‌రెడ్డి	ఇండిపెండెంట్	11116
1985	జేసీ దివాకర్‌రెడ్డి	కాంగ్రెస్	భూమిరెడ్డి రామచంద్రారెడ్డి	టీడీపీ	11484
1989	జేసీ దివాకర్‌రెడ్డి	కాంగ్రెస్	పేరం నాగిరెడ్డి	టీడీపీ	1219
1994	జేసీ దివాకర్‌రెడ్డి	కాంగ్రెస్	పేరం నాగిరెడ్డి	టీడీపీ	22880
1999	జేసీ దివాకర్‌రెడ్డి	కాంగ్రెస్	పేరం నాగిరెడ్డి	టీడీపీ	4043
2004	జేసీ దివాకర్‌రెడ్డి	కాంగ్రెస్	కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి	టీడీపీ	7877
2009	జేసీ దివాకర్‌రెడ్డి	కాంగ్రెస్	పేరం నాగిరెడ్డి	టీడీపీ	6955
2014	జేసీ ప్రభాకర్‌రెడ్డి	టీడీపీ	వీఆర్ రామిరెడ్డి	వైసీపీ	22172
2019	కేతిరెడ్డి పెద్దారెడ్డి	వైసీపీ	జేసీ అశ్మిత్‌రెడ్డి	టీడీపీ	7511

మూతపడిన పరిశ్రమలు

తాడిపత్రి ప్రాంతంలో పలు పరిశ్రమలు మూతపడ్డాయి. గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమలు, సిమెంట్ పరిశ్రమలు, కాటన్‌మిల్లుతో తాడిపత్రి ప్రాంతంలో కూలీలకు ఉపాధి కల్పిస్తూ జీవనం సాగించేవారు. ఇతర రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో కార్మికులు ఉపాధి కోసం వలసవచ్చారు. వీరందరికి సమృద్ధిగా ఉపాధి లభించేది. రానురాను పలు పరిశ్రమలు మూతపడ్డాయి. 1996లో తాడిపత్రి మండలంలోని యర్రగుంటపల్లి వద్ద ఉన్న కాటన్‌మిల్లు మూతపడింది. వాటితోపాటు 80 శాతం మేర గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమలు పెరిగిన రాయల్టీలు, పన్నుల భారంతో మూతపడ్డాయి. దీంతో వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఒకప్పుడు తాడిపత్రి ప్రాంతం పారిశ్రామిక అభివృద్ధి పట్టణంగా రూపుదిద్దుకుంది. ప్రస్తుత వైసీపీ పాలనలో వీటి నిర్వహణ గాడితప్పింది. తాడిపత్రి పట్టణంలో తాగునీటికి గండికోట నుంచి పైప్‌లైన్ ద్వారా ఆధారపడాల్సిన పరిస్థితి. హెచ్చెల్సీకి నీరు లేకపోవడంతో బీడు భూములుగా మారాయి. పెద్దపప్పూరు మండలంలోని శింగనగుట్టపల్లి, తబ్జుల, ముచ్చుకోట, చెర్లోపల్లి ప్రాంతాలతో పాటు పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు, కొండుపల్లి, భీమునిపల్లి ప్రాంతాల్లో ఖనిజాలకు సంబంధించిన గనులు ఎక్కువగా ఉన్నాయి. యాడికి మండలం భోగాలకట్ట, వెంగన్నపల్లి, రాయలచెరువులో డోలమైట్, స్రీటైట్ ఖనిజ పరిశ్రమలు స్థాపించారు. వీటిపై ఆధారపడి వేలాదిమంది కార్మికులు బతుకుతున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిబంధనల పేరుతో ఫ్యాక్టరీలను మూయించింది. దీంతో వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. హెచ్చెల్సీ కాలువకు 25 ఏళ్లగా నీరు లేకపోవడంతో 10వేల ఎకరాలు బీడు భూములుగా మారాయి. యాడికి కాలువకు నీరు రావాలనేది ఆ మండల వాసుల దశాబ్దాల కల. యాడికి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మండల వాసుల ఏళ్లనాటి కోరిక. పెద్దవడుగూరు మండలంలో కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలింది. యాడికి, పెద్దవడుగూరు మండలకేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఏర్పాటు చేస్తామని అప్పట్లో ప్రతిపక్షనేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నీటిమూటలుగానే మారాయి.

ధర్మవరం తరువాత యాడికే..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేనేత రంగానికి ధర్మవరం తర్వాత యాడికికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ రంగాన్ని నమ్ముకొని 8వేల మంది జీవనం సాగిస్తున్నారు. చేనేతలకు సరైన ప్రోత్సాహం లేక నేతన్నలు నేసిన చీరలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో పరిశ్రమ కుదేలైంది. చేనేత కార్మికులు వృత్తిని వదిలి సమీప పరిశ్రమల్లో కూలీలుగా మారుతున్నారు.

ప్రస్తుత ఓటర్ల సంఖ్య

మండలం	పురుషులు	స్త్రీలు	థర్డ్‌జెండర్	మొత్తం
తాడిపత్రి పట్టణం	42392	44438	16	86846
తాడిపత్రి రూరల్	24978	25389	4	50371
పెద్దవడుగూరు	18479	18325	-	36804
యాడికి	23072	23079	4	46155
పెద్దపప్పూరు	14263	13771	2	28036
మొత్తం	123184	125002	26	248212

జేసీ కంచుకోటగా తాడిపత్రి

రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా తాడిపత్రికి ఒక ప్రత్యేకత ఉంటుంది. హేమాహేమీలు బరిలో ఉంటుండడంతో అందరి చూపు తాడిపత్రి వైపు ఉండేది. 1985 నుంచి 2009వరకు ఏకధాటిగా కాంగ్రెస్ తరపున పోటీచేసిన జేసీ దివాకర్‌రెడ్డి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పలు పర్యాయాలు మంత్రిగా కూడా పనిచేశారు. రాష్ట్రం విడిపోవడంతో జేసీ కుటుంబం టీడీపీలో చేరింది. 2014ఎన్నికల్లో జేసీ దివాకర్‌రెడ్డి సోదరుడు జేసీ ప్రభాకర్‌రెడ్డి టీడీపీ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నియోజకవర్గ చరిత్రలో ఎక్కువసార్లు గెలిచిన రికార్డు జేసీ కుటుంబానికే దక్కుతుంది. 2019ఎన్నికల్లో జేసీ ప్రభాకర్‌రెడ్డి తనయుడు జేసీ అశ్మిత్‌రెడ్డి టీడీపీ తరపున పోటీచేసి వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి చేతిలో ఓడిపోయారు.


ఎంత ప్రేమో..!

మరణవార్త తెలిస్తే ఇళ్లవద్ద వాలుతున్న నేతలు

ఎన్నికల ప్రచారం ఉధృతంగా జరుగు తోంది. నాయకులు ఇంటింటి ప్రచారం ముమ్మరంగా చేస్తున్నారు. ఏ చిన్న సంఘటన జరిగినా తమకు అనుకూలంగా మలుచుకోవాలని యత్నిస్తున్నారు. ఈక్రమంలో పల్లెల్లో ఎవరైనా మరణించారని తెలిస్తే చాలు ఆ పార్టీ ఈ పార్టీ అన్న తేడా లేకుండా నాయకులు, అభ్యర్థులు అక్కడికి వాలిపోతున్నారు. వారి కుటుంబాలను పరామర్శించేందుకు పోటీ పడుతున్నారు. ఎన్నికలు లేనప్పుడు తమ పార్టీ కార్యకర్త మరణించినా అటువైపు వెళ్లని నేతలు కూడా గ్రామాల్లోకానీ, పట్టణాల్లోకానీ మృతిచెందారని విషయం తెలియగానే పూలదండ తీసుకుని మృతదేహం వద్ద ప్రత్యక్షం అవుతు న్నారు. ఒకవేళ తాము అనుకున్న నేత సకాలంలో రాకపోతే వచ్చేవరకు అంత్యక్రియలు జరపకుండా ఆపుతున్నారు. దీంతో వివిధ పార్టీల నాయకులు మృతిచెందిన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు పోటీపడుతున్నారు. మృతిచెందిన వారి ఇంటివద్దకు పదుల సంఖ్యలో బంధువులు, మిత్రులు వచ్చి ఉంటారు. దీనివల్ల ఎంతో కొంత తమకు సానుకూలత ఏర్పడుతుందని క్యూకడుతున్నారు. అంతేకాకుండా అంత్యక్రియలకు సైతం కొంత మొత్తాన్ని మృతుల కుటుంబ సభ్యుల చేతిలో పెడుతున్నారు. ఇలాంటి అభిమానం ఎన్నికలు లేనప్పుడు కూడా చూపితే బాగుంటుందని సామాన్యులు అంటున్నారు.

- హిందూపురం

వ్యవసాయ రంగం సర్వనాశనం



గోరంట్ల: ప్రభుత్వ విధానాల వలన వ్యవసాయ రంగం సర్వనాశనమైంది. దిన కూలి పెరగడం, పనులు చేసేవారులేక, పంటలు సాగుచేయలేక, బీళ్లు పెడుతున్నాం. ఉచిత కరెంటు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం పది మార్లు విద్యుత్ చార్జీలు పెంచింది. జలకళ పేరుతో ఉచిత బోర్లు వేస్తామని చెప్పి నిధులులేక చేతులెత్తేశారు. వ్యవసాయమోటర్లకు మీటర్లు బిగిస్తున్నారు. ఉపాధి పనులు లేవు. డీజిల్, పెట్రోల్ ధరలు పెంచి, బస్సు చార్జీలు పెంచారు. రైతు భరోసా ఏడాదికి రూ.6వేలు విడతల వారీగా ఇస్తే ఏమి సరిపోతాయి. టీడీపీ అధికారంలోకి వస్తే ఏడాదికి రైతుకు రూ.20వేలు ఇస్తామంటోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామంటున్నారు. ఇన్ని హామీలు ఎలా నేరవేరుస్తారో అర్థం కావడంలేదు. టీడీపీ పాలనలో పొలాలకు సారవంత మైన చెరువు మట్టిని ఉచితంగా తోలేవారు. ఇపుడు ఆ పరిస్థితి ఏమాత్రం లేదు. వైసీపీ హామీలకంటే టీడీపీ హామీలే బాగున్నాయి. రైతుకు మేలు జరగడమే కావలసిందే. లేదంటే తినడానికి తిండిగింజలు పండిచేవారే కరువుతారు.

- బొక్కసం అంజినప్ప, రైతు, గోరంట్ల

దగా పడ్డ ప్రజలకు కూటమి మేనిఫెస్టోతో స్వాంతన



ప్రచారంలో పాల్గొన్న దగ్గుబాటి, అంబికా



దగ్గుబాటి ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న భవాని రవికుమార్

కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 30: వైసీపీ పాలనలో దగా పడ్డ జనానికి ఎన్డీయే కూటమి ఎన్నికల మేనిఫెస్టో స్వాంతన కలిగిస్తోందని అనంత అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక 17, 18, 49, 50 డివిజన్ల పరిధిలోని కాలనీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆయన ఘనంగా స్వాగతం పలికారు. జనసేన రాష్ట్ర నాయకుడు భవాని రవికుమార్ తన ఇంటి వద్ద దగ్గుబాటి ప్రసాద్‌కు ఘన స్వాగతం పలికారు. ప్రచారంలో దగ్గుబాటి ప్రసాద్ మాట్లాడుతూ... చంద్రబాబునాయుడు, కూటమి ముఖ్యనేతలు ఎన్నికల మెనిఫెస్టో విడుదల చేసిన రెండు గంటల్లోనే అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. తాజాగా విడుదల చేసిన మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో నిరుత్సాహంలో ఉన్న నిరుద్యోగ యువత కలలు సాకారం చేసేలా మేనిఫెస్టో ఉందన్నారు. చంద్రబాబు సీఎం అయిన వెంటనే తొలి సంతకం డీఎస్సీపైనే పెడతానని మెనిఫెస్టోలో హామీ ఇవ్వడంపై ఆ వర్గాలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాయన్నారు. జగన్‌రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ యాక్టును అమల్లోకి తెచ్చి భూములు కాజేసేందుకు కుట్ర చేశారని, అధికారంలోకి రాగానే ఆ యాక్టును రద్దు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికే తమ విజయం ఖరారైందని, ఈ మేనిఫెస్టో విడుదల తర్వాత తమ మెజార్టీ భారీ స్థాయిలో ఉండబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు కుట్రపూర్తి ప్రచారాలను మైనార్టీలు నమ్మొద్దని, టీడీపీ అధికారంలోకి రాగానే ముస్లిం, మైనార్టీలకు గతంలో కంటే మెరుగ్గా సంక్షేమ పథకాలు అమలు చేసి న్యాయం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూప, నాయకులు ప్రకాష్‌నాయుడు, భవాని రవికుమార్, గౌస్‌మొద్దీన్, రవి, సత్య, హరి, సికిందర్, వెంకటస్వామి, సరిపూటి రమణ, నెట్టెం బాలకృష్ణ, నటేష్ చౌదరి పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న దగ్గుబాటి శ్రీలక్ష్మి

ప్రముఖుల ప్రచారం

అనంత అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి దగ్గుబాటి శ్రీ లక్ష్మీ మంగళవారం ఐదో డివిజన్‌లోని ఖాజా నగర్, శ్రీనివాస్ నగర్, నారాయణపురం పంచాయతీలోని భువనేశ్వరి కాలనీ, ఎస్సీ కాలనీ, నారాయణపురం గ్రామంలో ప్రచారం చేశారు. ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. 13వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్లు బల్లా పల్లవి, విజయశ్రీరెడ్డి, కురుబ నారాయణస్వామి, చెరుకూరి శివ, మారుతీ చౌదరి, లక్ష్మీనాయుడమ్మ, 39వ డివిజన్‌లో తలారి ఆదినారాయణ, కొండ వీటి భావన, నగేష్‌నాయుడు, సుధాకర్‌నాయుడు, చేపల హరి ప్రచారం నిర్వహించారు. దగ్గుబాటి ప్రసాద్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

రైతులను దగా చేసిన తోపుదుర్తి

కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత

ఆత్మకూరు, ఏప్రిల్ 30: నియోజకవర్గంలో సాగునీటి పేరుతో రైతులను తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి దగా చేశారని, లక్ష ఎకరాలకు నీరు ఇస్తానని మాయమాటలతో మోసం చేశారని మాజీ మంత్రి , కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత మండిపడ్డారు. మండలంలో మంగళవారం ముట్టాల, గొరదిండ్ల తండా, పి సిద్ధరాంపురం, పంపనూరు, పంపనూరు తండా, పి యాలేరు, వడ్డుపల్లి, తలుపూరు గ్రామాల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... ప్రకాష్‌రెడ్డి అపద్దాలుతో ఐదేళ్ళు గడిపారని, డ్యాంల పేరుతో దగా చేయడమే కాకుండా మరోసారి ప్రజలు, రైతులను మోసం చేయడానికి లేనిపోని హామీలు ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, మండల ఇన్‌చార్జి బాలాజి, ఎంపీటీసీ పారిజాతమ్మ, నారాయణస్వామి, పరుశురామ్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...

అనంతపురంరూరల్ : నియోజకవర్గంలో పలువురు వైసీపీ నాయకులు జిల్లా కేంద్రంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఆత్మకూరు మండలం తలుపుల గ్రామానికి చెందిన పదికుటుంబాలు, కనగానపల్లి మండలం బద్దలాపురం, చెన్నెకొత్తపల్లి మండలం ప్రసన్నయపేట, అమిదాలకుంట, కొండకిందపల్లి గ్రామాలకు చెందిన 15 కుటుంబాలు, కామారుపల్లికి చెందిన కొంతమంది నాయకులు టీడీపీలోకి చేరారు.

కుటుంబ సభ్యుల ప్రచారం

రామగిరి మండలం పేరూరులో పరిటాల రవి పెద్దకోడలు పరిటాల జ్ఞాన, పరిటాల కవిత, గుంటూరు లక్ష్మి ప్రచారం నిర్వహించారు. ఆకుతోటపల్లిలో పరిటాల రవి సోదరి ఉష, పరిటాల రవి చిన్నకోడలు తేజశ్వి, పరిటాల సుమతి, కొడిమి పంచాయతీలో పరిటాల శైలజా, బైటీని చైతన్య ప్రచారం చేశారు.

నేడు పలు గ్రామాల్లో ప్రచారం

రాప్తాడు : పాలబావి, ఎం. చెర్లోపల్లి, చాపట్ల, గోళ్లపల్లి, హంపాపురం గ్రామాల్లో పరిటాల సునీత ప్రచారం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివా సులు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు పాలబావిలో ప్రచారం ప్రారంభ మవుతున్నారు.





ముట్టాలలో మహిళలతో కలసి ప్రచారం చేస్తున్న పరిటాల సునీత, ఆకుతోటపల్లి ప్రచారంలో పాల్గొన్న పరిటాల కుటుంబ సభ్యులు

నగరంలో ఇద్దరి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఏప్రిల్ 30 : నగర పరిధిలో మంగళవారం వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. సోమనాథ్‌నగర్ చెందిన ఉప్పర రమేష్ (30) పాల డెయిరీ నిర్వహించేవాడు. ఈ క్రమంలో అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. మంగళవారం తన ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. యువజన కాలనీలో శ్రీకాంత్, సంధ్య (27) నివాసముంటున్నారు. శ్రీకాంత్ తాగుడు మానేయాలని సంధ్య తరచూ కోరుతుండేది. అతను మారలేదని మనస్తాపానికి గురైన సంధ్య మంగళవారం తన ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందింది. వీరికి కొడుకు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై నగర త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్ సమస్యలను పరిష్కరించండి



జిల్లా ఎన్నికల అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, ఏప్రిల్ 30: ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ సమస్యలను పరిష్కరించాలని ఏపీ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ భాస్కర్ తదితరులు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌కు విన్నవించారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఫామ్-12ను సంబంధిత ఎన్నికల అధికారులకు అందజేసినా రసీదు ఇవ్వడం లేదని వారు అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించే సమయంలో ఏవైనా సమస్యలు వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని అన్నారు. రసీదులు ఇవ్వకపోవడం వల్ల తాము ఓటు వేసే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందని ఉద్యోగ వర్గాల్లో ఆందోళన వ్యక్తమౌతోందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఉద్యోగికి ఫోన్ కాల్ లేదా మెసేజ్ ద్వారా సమాచారం అందిస్తామని వారికి కలెక్టర్ హామీ ఇచ్చారు

బాధితురాలికి ఆర్థిక సాయం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 30 : అనంతపురం నగరం ఉమానగర్‌కు చెందిన షాహిన్ రోడ్డు ప్రమాదంలో వెన్నముక దెబ్బతినడంతో నడవలేని స్థితిలో మంచానికే పరిమితమైంది. మంగళవారం మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమానగర్‌కు వెళ్లారు. షాహిన్ పరిస్థితిని చూసి చలించిపోయారు. తనవంతుగా రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

పుట్లూరు : మండలంలోని కుమ్మనమల, మడ్డిపల్లి గ్రామా ల ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేసినట్లు మంగళవారం ఎంపీడీఓ దస్తగిరి తెలిపారు. ఇద్దరు ఫీల్డ్ అసిస్టెం ట్లు వైసీపీ ఎన్నికల ప్రచారంలో పా ల్గొన్నారన్నారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతోపాటు ఫొటోల ఆధారంగా డ్వామా పీడీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారని తెలిపారు.

టీడీపీతోనే శింగనమల అభివృద్ధి

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసా నాయుడు

నార్పల, ఏప్రిల్ 30: టీడీపీతోనే శింగనమల నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు అన్నారు. నార్పల మండలంలోని తుంపెర గ్రామంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను గెలిపించాలని మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇందులో టీడీపీ జిల్లా టీడీపీ నాయకులు ఆలం వెంకట నరసా నాయుడు, పిట్టురంగారెడ్డి, ఎర్రినాగప్ప, ఆలం నాగార్జుననాయుడు, బయపరెడ్డిచంద్రబాబు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో ప్రచారం

శింగనమల: బండారు శ్రావణిశ్రీ బుధవారం శింగనమల మండలంలోని జూల్కాకాలువ, పెద్దజలాలపురం, చిలేపల్లి ఇరువెందల, కల్లుమడి తరిమెల గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారని, పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు తరలిరావాలని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు పిలుపునిచ్చారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి

గార్లదిన్నె: మండలంలోని సంజీవపురం, బూదేడు గ్రామాల్లో ముంటిమడుగు కేశవరెడ్డి, సీనియర్ నాయకురాలు బండారు లీలావతి, బండారు కిన్నెర శ్రీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పాతకల్లూరులో 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

బుక్కరాయసముద్రం: రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు బుక్కరాయసముద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ అశోక్‌కుమార్, జిల్లా నాయకులు పొడరాళ్ల రవీంద్రా, సాకే రామక్రిష్ణ, లక్ష్మీనారాయణ, కేశన్న, ఎస్‌నారాయణస్వామి పాల్గొన్నారు.



తుంపెరలో ప్రచారం నిర్వహిస్తున్న ఆలం నరసానాయుడు

ఎన్‌డీఏ మేనిఫెస్టోతో అన్ని వర్గాలకూ న్యాయం

అనంతపురంరూరల్, ఏప్రిల్ 30: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టో పేద, మధ్యతరగతి, కార్మిక తదితర అన్ని వర్గాల ఆమోదయోగ్యమైందని టీడీపీ మండల నాయకులు అన్నారు. మంగళవారం పాపంపేటలోని పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, సత్యసాయి జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు తాడాల నాగభూషణం, శ్రీరాములు, సాంబశివ మాట్లాడారు. మేనిఫెస్టో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించారన్నారు. రైతులకు పెట్టుబడి సాయానికి రూ.20వేలు, వ్యవసాయ పరికాలు, చేనేతలకు ఉచిత కరెంటు, నిరుద్యోగ భృతి, మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు, తల్లి వందనం పథకం పిల్లల చదువుకుల రూ.15 చొప్పున ఎంత మంది ఉంటే అంతమంది ఇస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. కావున అన్ని వర్గాల ప్రజలు కూటమి అభ్యర్థులను గెలుపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

టీడీపీతోనే నాయీబ్రాహ్మణుల సంక్షేమం

శింగనమల ఏప్రిల్ 30: నాయిబ్రాహ్మణుల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి ఆదినారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోలో దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు రూ.25,000 గౌరవవేతనం, హెయిర్ సెలూన్ షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు, రూ. 5వేల కోట్లతో ఆదరణ పథకం ద్వారా వృత్తి పరికరాలు ఆర్థికసహాయం, బీసీలకు 50 ఏళ్లకే రూ 4000 పింఛన్, బీసీ వర్గాలకు రాజకీయం పోటీచేయలేని వారికి కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం ప్రకటించడం హర్షిణీయమన్నారు.

15 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 30: ఏటా నిర్వహించే వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను ఈ సారి సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఈనెల 15 నుంచి ప్రారంభిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి (డీఎస్‌డీఓ) షేక్ షఫీ తెలిపారు. 50 సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. 30 రోజుల పాటు ఈ శిబిరాలు సాగుతాయన్నారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు ఆయా ప్రాంతాల్లో ఆయా క్రీడలకు నిర్వహించే శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చీనీకాయలు టన్ను రూ.36 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 30: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.36 వేలు, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.22 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 542 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

రాప్తాడు, ఏప్రిల్ 30: రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాల్లో పదో తరగతిలో 500 మార్కులు సాధించిన విద్యార్థులు ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఏటీఎల్ మల్లికార్జున మంగళవారం తెలిపారు. స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీసీ, ఓసీలు పదో తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఏ పాఠశాలలో నైనా ఉత్తీర్ణులై ఉండాలని అన్నారు. ఈ నెల 19న వారికి ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

'అనంతలక్ష్మి' విద్యార్థుల ప్రతిభ

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 30: ఇటీవల నిర్వహించిన పుట్టపర్తి సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల జాతీయ సదస్సులో అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మేఘన, సంజయ్, తరణి, పొతిరెడ్డి, భాగ్యలక్ష్మి, సుప్రయ ఉత్తమ ప్రతిభ చాటారు. ఆ విద్యార్థులను మంగళవారం అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో వైస్ చైర్మన్ రమేష్ నాయుడు అభినందించారు. సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామమూర్తి, ఈసీ విభాగాధిపతి అజయ్‌కుమార్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

అనంతపురం టౌన్ : జేఎన్‌టీయూలో కౌంటింగ్ కేంద్రాలు, రిసెప్షన్ కౌంటర్ల ఏర్పాట్లను కేంద్ర పరిశీలకులు ఐఏఎస్ మనీష్‌సింగ్, ఐఏఎస్ అజయ్‌నాథ్, ఐపీఎస్ రవికుమార్, కలెక్టరు వినోద్ కుమార్, ఎస్పీ అజిత్ బర్దర్ మంగళవారం పరిశీలించారు. అలాగే ఈవీఎంల భద్రతకు స్ట్రాంగ్ రూమ్స్ , అక్కడ భద్రతా చర్యలు గురించి పలు ఆదేశాలు జారీ చేశారు.

తాడిపత్రి నియోజకవర్గ బ్యాలెట్స్ ర్యాండమైజేషన్

కలెక్టరేట్‌లో మంగళవారం తాడిపత్రి నియోజకవర్గానికి సంబంధించిన బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను పగడ్బందీగా నిర్వహించారు. కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ నేతృత్వంలో పలువురు అధికారులు, పలు పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈప్రక్రియన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, అసిస్టెంట్ కలెక్టరు బొల్లి పల్లి వినూత్న పాల్గొన్నారు.

నార్పలలో చీనీ తోట దగ్ధం

నార్పల, ఏప్రిల్ 30: నార్పలలో సోమవారం సాయంత్రం రైతు గుజ్జల వెంకటరాముడుకు చెందిన చీనీ తోటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. వెంకటరాముడు తన పొలంలో రోజులాగే పనులు చూసుకుని ఇంటికి వచ్చాడు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు చీనీ తోటకు నిప్పుపెట్టారు. దీంతో నాలుగేళ్లుగా పెంచుకున్న 400 చీనీ చెట్లు, డ్రిప్ పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.5 లక్షలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. రెవెన్యూ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నష్ట నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.



దగ్ధమైన చీనీ తోట

ఎన్‌సీఏ క్యాంపును సందర్శించిన భారత మాజీ క్రికెటర్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 30: అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న నేషనల్ క్రికెట్ అసోసియేషన్ (ఎన్‌సీఏ) అండర్-15 బాలికల క్రికెట్ శిక్షణ శిబిరాన్ని మాజీ భారత క్రికెటర్, ఎన్‌సీఏ హెడ్ సుజిత్ సోమసుందర్ మంగళవారం సందర్శించారు. క్రీడాకారిణులకు బ్యా టింగ్, ఫీల్డింగ్, కీపింగ్, బౌలింగ్‌లపై మెళుకువలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి క్రీడలు, క్రీడాభి వృద్ధికి అవసరమైన సమాలోచనలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, కోచ్ షాబుద్దీన్ పాల్గొన్నారు.



క్రికెటర్లకు అవగాహన కల్పిస్తున్న సుజిత్ సోమసుందర్



శూలాన్ని అర్చకుడికి అందజేస్తున్న సుబ్రహ్మణ్యం

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి శూలం వితరణ

గార్లదిన్నె, ఏప్రిల్ 30 : మండలంలోని కోటంక గ్రామ సమీపంలో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి రాగి దానికి బంగారు పూత వేయించిన శూలాన్ని అనంతపురం పట్టణానికి చెందిన కళ్యాణి కట్ట సుబ్రహ్మణ్యం దంపతులు (అనంత రియాల్టీ కంపెనీ) వారు అందజేసినట్లు ఆలయ ఈఓ బాబు తెలిపారు. ఆ శూలాన్ని మంగళవారం ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులకు అందచేశారన్నారు. శూలం విలువ సుమారు రూ. 2 లక్షలు ఉంటుందన్నారు.

జాతీయ పోటీలకు జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్ : విజయవాడలో రెండు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌టెన్నిస్ పోటీల్లో జిల్లాకు చెందిన ఎస్ ఆరోస్ రోనాల్డిన్‌హో, వై భానుప్రకాష్, ఎస్ కిరణ్మయి ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. వీరు ఈ నెల 29 నుంచి పంజాబ్ రాష్ట్రం మొహాలీలో నిర్వహించే 21వ జాతీయ సీనియర్ సాఫ్ట్‌టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటారని ఆ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శేఖర్ తెలిపారు.



భానుప్రకాష్, కిరణ్మయి, ఆరోస్ రోనాల్డిన్‌హో



పెండ్యాల శ్రీలత ఆధ్వర్యంలో జనసేనలో చేరుతున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

జనసేనలోకి వైసీపీ నేతల చేరిక

అనంతపురం ప్రెస్‌క్లబ్ : వైసీపీ నుంచి పలువురు నేతలు వైసీపీలోకి చేరారు. ఈ మేరకు మంగళవారం జనసేన పార్టీ రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత ఆధ్వర్యంలో 5,12,48 డివిజన్‌లకు చెందిన 20 కుటుంబాలు జనసేన తీర్థం పుచ్చుకున్నాయి. పెండ్యాల శ్రీలత వారందరినీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పెండ్యాల చక్రపాణి, ప్రసాద్, వీర మహిళలు శైలజా, యమున, గాయత్రి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 30: కనగానపల్లి మండలంలోని తగరకుంట సమీపంలో 192 కర్ణాటక మద్యం ప్యాకెట్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. నరసంపల్లి వైపు నుంచి ద్విచక్రవాహనంలో ఒక వ్యక్తి ఆ ప్యాకెట్లను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని, తగరకుంటకు చెందిన ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆ శిశువులు మీవాళ్లైతే సంప్రదించండి

అనంతపురం విద్య: ఐసీడీఎస్ పరిధిలోని శిశుగృహ సంరక్షణలో ఉన్న ఇద్దరు శిశువుల తల్లిదండ్రులు, రక్తసంబం ధీకులు 30 రోజుల్లో తమను సంప్రదించాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2 నెలల వయస్సు ఉన్న అయాన్, ఒక నెల 10 రోజుల వయస్సు ఉన్న అనన్య నగరంలోని శిశుగృహ సంరక్షణలో ఉన్నారని పేర్కొన్నారు. ఆ శిశువుల సంబంధీకులు తగిన ఆధారాలతో 30 రోజుల్లో ఐసీడీఎస్ అధికారులను సంప్రదించాలన్నారు. లేనిచో బాలల సంక్షేమ సమితి ద్వారా ఆ శిశువులను అనాథలుగా గుర్తించి, అర్హులైన , దత్తత కోరే తల్లిదండ్రులకు దత్తత ఇస్తామని స్పష్టంచేశారు.

న్యాయవాది ఇంట్లో చోరీ

అనంతపురం క్రైం, ఏప్రిల్ 30: నగర శివారులోని కళ్యాణదుర్గం రోడ్డు భాగ్యనగర్ రెండో క్రాస్‌లో నివాసముంటున్న న్యాయవాది నరసింహులు ఇంట్లో చోరీ జరిగింది. ఐదున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ. 1.50 లక్షలు చోరీ అయ్యాయి. నరసింహులు నాలుగు రోజుల క్రితం తన కుటుంబసభ్యులతో కలిసి సమీప బంధువుల వివాహానికి వెళ్లాడు. సోమవారం రాత్రి ఇంటికి తిరిగి రాగా, ఇంటి తాళం పగలకొట్టి ఉండటం.. ఇంట్లో వస్తువులను చిందరవందరగా పడేసి ఉండటాన్ని చూసి గాభరా పడ్డారు. ఐదున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

4,425 పింఛన్లు ఖాతాల్లోకి...

శింగనమల ఏప్రిల్ 30: మండలంలో మొత్తం 6,539 పింఛన్‌దారులు ఉండగా.. అందులో 4,425 మందికి సొమ్ము వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నట్లు ఎంపీడీఓ బీ.వెంకటరమణ తెలిపారు. బుధవారం మేడే సందర్భంగా బ్యాంకులు సెలవు అని, పింఛన్‌దారులు గురువారం బ్యాంకు వద్దకు వెళ్లి పింఛన్లు తీసుకోవాలని సూచించారు. దివ్యాంగులు, ఇబ్బందులు పడుతున్న వృద్ధులు 2014 మందికి సచివాలయం సిబ్బందితో ఇంటి వద్దే పంపిణీ చేస్తామని తెలిపారు.

టీడీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 30 : అనంతపురం రూరల్ పంచాయతీ రామక్రిష్ణకాలనీలో తనపై టీడీపీ నాయకులు దాడి చేశారంటూ ఎంపీటీసీ భర్త నగేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆ టీడీపీ నాయకులపై మంగళవారం ఎస్సీ. ఎస్టీ కేసు నమోదు చేశారు. మూడు రోజుల క్రితం టీడీపీ నాయకులు ఆ కాలనీలో ప్రచారం చేశారు. సౌండ్ తగ్గించాలని వైసీపీ నాయకులు చేపట్టిన గొడవ ఇరువర్గాల ఘర్షణకు దారి తీసింది. తనకు గాయాలయ్యాలంటూ నగేష్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు టీడీపీ నాయకుడు జయరాంనాయుడు, అనుచరులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు.

ప్రతి చెరువుకు నీరిస్తా

● రోడ్‌షోలో ఎమ్మెల్యే పయ్యావుల హామీ



ప్రజలకు అభివాదం చేస్తూ ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

బెళుగుప్ప, ఏప్రిల్ 30: కూటమి అధికారంలోకి వస్తే మండలంలోని ప్రతిచెరువుకు నీరిచ్చి రైతన్నను ఆదుకుంటానని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. గ్రామగ్రామాన విశేష స్పందన లభించింది. గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని అధికారంలోకి రాగానే పరిష్కరించేందుకు కృషి చేస్తానని కేశవ్ అన్నారు. టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి మినహా వైసీపీ ఈ అయిదేళ్లలో ఏమి చేశారని ప్రశ్నించారు. విశ్వేశ్వర రెడ్డి ఒక్క అభివృద్ధి అయినా చేశారా అని ప్రశ్నించారు. ఆయనకు ఓటేస్తే వృథాయేనని విమర్శించారు. ఉన్న చెరువులను నింపలేని అసమర్థ నాయకుడు అన్నారు. భూకబ్జాదారులకు ఓటేయవద్దన్నారు. అభివృద్ధి ఏమిటో తాను చేసి నిరూపిస్తానన్నారు. దళిత, గిరిజనులను ఆదుకుంటామన్నారు. రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయన్నారు. శ్మశాన వాటిక, సీసీ రోడ్లు వేయిస్తానన్నారు. చెరువులకు నీరిస్తేనే గిట్టుబాటు అవుతుందని రైతులకు విన్నవించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాధాకృష్ణ, ఆనంద్, పెద్ద తిప్పయ్య, మల్లికార్జున, తగ్గుపర్తి రాధాకృష్ణ, తిమ్మప్ప, సురేష్ రాము, శివప్ప, ఓబుళేసు, దేవప్ప, రమేష్, శ్రీనివాసులు, భాష, అంజి, మారెప్ప, ధనుంజయ పాల్గొన్నారు.



నరసాపురంలో బత్తాయి గజమాలతో కేశవ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

పయ్యావుల కేశవ్‌కు గజమాలతో ఘన స్వాగతం

నరసాపురంలో ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు వెంకటేశులు, అరవింద్, మురళి, ప్రసాద్, నరిగన్న, చిన్న బాలప్ప, హనుమంతరెడ్డి, వెంకటేశులు, నాగరాజు, నారాయణ స్వామి బత్తాయిల గజమాలతో ఘన స్వాగతం పలికారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



ప్రచారంలో పాల్గొన్న విజయ్‌సింహా

ఉరవకొండ: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే తనయుడు విజయ్‌సింహా అన్నారు. వజ్రకరూరు మండలంలోని గంజికుంట, కమలపాడు, కమలపాడుతండా, ప్యాపిలి గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థి పయ్యావుల కేశవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నాగేంద్ర, సుధాకర్, ధనుంజయ, నాగన్న, పెద్దన్న, రామచంద్ర నాయక్, లాలునాయక్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

● ఉమ్మడి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు



రోడ్‌షోలో మాట్లాడుతున్న శ్రావణిశ్రీ, చిత్రంలో ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ

పుట్లూరు, ఏప్రిల్ 30: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ ఉమ్మడి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అంబికా లక్ష్మీనారాయణ, బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని గరుగుచింతలపల్లి, చిన్నమల్లేపల్లి, కోమటికుంట్ల, పుట్లూరు, శనగలగూడూరు, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడా తాగునీటి సమస్యకు పరిష్కారం చూపిన దాఖలాలు లేవన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ముందుగా గండికోట నుంచి పైప్‌లైన్ వేసి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. ఎస్సీ కాలనీల్లో సమస్యలను దృష్టిలో ఉంచుకొని పరిష్కరిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో తమను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, మండల కన్వీనర్ బాలరంగయ్య, చవ్వా కులశేఖర్‌రెడ్డి, రవిచంద్రనాయుడు, జయుడు, రాజేష్, నాగేశ్వరరెడ్డి, గోవర్ధన్‌రాజు, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల వైపే ప్రజలు

యాడికి, ఏప్రిల్ 30: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల వైపే ఓటర్లంతా ఉన్నారని అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం రాయలచెరువులో ఆయన పలువురు టీడీపీ నాయకులను కలిశారు. ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైకోను రాష్ట్ర ప్రజలు తరిమికొట్టే రోజులు అతి దగ్గరలో ఉన్నాయన్నారు. మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, నాయకులు పరిమి చరణ్, మాదాల అనిల్, శోభన్‌బాబు, సుధాకర్, తిరంపురం నీలకంఠ, ఆదినారాయణ, మహబూబ్ బాషా ఉన్నారు.

పకడ్బందీగా బ్యాలెట్స్ ర్యాండమైజేషన్: కలెక్టర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 30: నగరంలోని జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం తాడిపత్రి నియోజకవర్గానికి సంబంధించిన బ్యాలెట్‌యూనిట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించారు. కలెక్టరు జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ నేతృత్వంలో పలువురు అధికారులు, పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ ప్రక్రిక చేపట్టారు. కలెక్టరు మాట్లాడుతూ తాడిపత్రి నియోజకవర్గంలో ఇప్పటికి 274 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 331 బ్యాలెట్ యూనిట్లు కేటాయించామన్నారు. అయితే ఎన్నికల నిబంధనల మేరకు అత్యధికంగా 16 మంది అభ్యర్థులకు పైగా ఉంటే అదనంగా 20శాతం బ్యాలెట్‌యూనిట్స్ కేటాయించాల్సి ఉంటుందన్నారు. ఆ మేరకు తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలలో పోటీలో 18మంది ఉన్నారన్నారు. ఇందుకు అదనంగా మరో బ్యాలెట్‌యూనిట్ అవసరమైందన్నారు. ఆ మేరకు తాడిపత్రి నియోజకవర్గానికి 329 బ్యాలెట్ యూనిట్లు కేటాయించి వాటికి ర్యాండమైజేషన్ చేశామన్నారు. నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, అసిస్టెంట్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న పాల్గొన్నారు.

జనసేన పార్టీలోకి వైసీపీ యూత్ నాయకులు

బెళుగుప్ప, ఏప్రిల్ 30: మండలంలోని శీర్పి గ్రామంలో పది మంది వైసీపీ యూత్ నాయకులు మంగళవారం జనసేన పార్టీలోకి చేరారు. మండల అధ్యక్షుడు సుధీర్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

ఇంటివద్దకే పింఛన్ అందించాలి

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 30: సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేపట్టాల్సిందేనని ఎంపీడీఓ అల్లాబకాష్ మంగళవారం ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 19 పంచాయతీ పరిధిలో 5394 మంది లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు. 4099 మంది పింఛనుదారులకు ఒకటో తేదీన వారి ఖాతాలో పింఛన్ సొమ్ము జమ చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన 1295 మందికి సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేయాలన్నారు.

యాడికి: మండలంలో బుధవారం నుంచి పింఛన్ల పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. 8062 మంది పింఛన్‌దారులు ఉన్నట్లు ఆమె తెలిపారు. 5691 మంది అకౌంట్లలోకి నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. 2371మందికి ఇంటికివెళ్లి అందజేస్తామన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

● రోడ్‌షోలో అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 30: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు హామీ ఇచ్చారు. మంగళవారం శెట్టూరు మండలం చిన్నంపల్లి, బొచ్చుపల్లి, లింగదీర్లపల్లి, కైరేవు, చెర్లోపల్లి, మాలేపల్లి, ఎర్రబోరేపల్లి, కంబాలపల్లి, లక్ష్మంపల్లి గ్రామాల్లో అమిలినేని రోడ్ షో నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్థులు ఆయా గ్రామాలలో పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. అమిలినేని మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాంత ప్రజలకు తాగు, సాగునీరు అందిస్తామని తెలిపారు. వచ్చే రెండేళ్లలో రైతులకు సాగునీరందించి ఆదుకుంటామన్నారు. తలారి రంగయ్య, ఉమామహేశ్వరనాయుడుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలోకి రాగానే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఎంపీగా ఏమీ చేయలేని రంగయ్య ఎమ్మెల్యేగా ఏంచేస్తాడని ఎద్దేవా చేశారు. కనీసం మున్సిపల్ చైర్మన్ సీట్లో కూర్చోనివ్వకుండా ఒక బీసీ నాయకుడిని మంత్రి అడ్డుకుంటే వాటిని కూడా రంగయ్య పరిష్కరించలేకపోయారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ప్రచారం

కుందుర్పి: కూటమి విజయంతోనే దివ్యాంగుల సంక్షేమం సాధ్యమవుతుందని దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సురేంద్రబాబు అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవడం తమ బాధ్యత అని అన్నారు. మర్రిస్వామి, శివానంద, మంజు, దివ్యాంగులు పాల్గొన్నారు.

రైతులకు రూ.20 వేలు పరిహారం: రైతులకు ఏటా రూ.20 వేలు పంటనష్టపరిహారం అందించనున్నట్లు అమిలినేని కుటుంబ సభ్యులు తెలిపారు. కుందుర్పి మండలం బెస్తరపల్లి, మహంతపురం, కదరంపల్లి గ్రామాల్లో మంగళవారం సురేంద్రబాబు సోదరి రాధామాధవి, కుటుంబ సభ్యులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. మే 13న ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



ప్రజలను ఓటు అభ్యర్థిస్తున్న అమిలినేని సురేంద్రబాబు

బ్రహ్మసముద్రంలో వైసీపీకి షాక్

బ్రహ్మసముద్రం: మండలం భైరసముద్రం, అజ్జయ్యదొడ్డి, తిప్పయ్యదొడ్డి గ్రామాలకు చెందిన వైసీపీలో కీలకనేతలు మంగళవారం టీడీపీలో చేరారు. బోయ లక్ష్మన్న, వార్డు మెంబర్లు నీరుగంటి పాతలింగ, కుంటిపాలప్పగారి యర్రిస్వామి, చాకలి రంగన్న, స్కూల్ కమిటీ చైర్మన్ గంగన్నతోపాటు 74 కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి అమిలినేని సురేంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. న్యాయవాదులు దేవేంద్ర, సుదర్శన్, ముత్యాలప్ప, దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో పసుపు కండువాలు కప్పుకుని టీడీపీ పార్టీలోకి చేరారు. పార్టీలోకి చేరిన వారందరికీ అమిలినేని సురేంద్రబాబు టీడీపీ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అదేవిధంగా మండల సమీపంలోని తిప్పయ్యదొడ్డి గ్రామంలో కన్వీనర్ శ్రీరాములు ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ, వైసీపీ నాయకులు గొల్ల కెంచరప్పతోపాటు 15 యాదవ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి.



రోడ్‌షోకు హాజరైన అశేష జనవాహిని



టీడీపీలోకి చేరిన వారితో అమిలినేని

దౌర్జన్యం చేస్తే సహించం

● ప్రజల జోలికొస్తే తాటతీస్తా
● వైసీపీ ఎమ్మెల్యేకు జయరాం హెచ్చరిక

పామిడి, ఏప్రిల్ 30: రాజకీయంలో దౌర్జన్యం చేస్తే సహించేది లేదు... ప్రజల జోలికి వస్తే తాటతీస్తానని గుంతకల్లు నియోజకవర్గ కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరాం వైసీపీ అభ్యర్థి వై వెంకటరామరెడ్డిని హెచ్చరించారు. పట్టణంలోని ఎద్దులపల్లిరోడ్డులో ఉన్న ఓ పంక్షన్ హాలులో మంగళవారం ఏర్పాటు చేసిన భగీరథ ఉప్పర(సగర) ఆత్మీయ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కుర్చీ కోసం నువ్వు నేను ఎనీ టైం ఫేస్ టు ఫేస్ చూసుకుందాం.. ఈ పోరాటంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే తాటతీస్తానని హెచ్చరించారు. నన్ను రెచ్చగొడితే లా అండ్ ఆర్డర్ కూడా తట్టుకోలేదన్నారు. పామిడి పట్టణంలో భగీరథ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులకు గురవుతారని హితువు పలికారు. మాజీ జడ్పీటీసీ దాసరి లక్ష్మీకాంతమ్మ, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, జింకల సంజీవకుమార్, నల్లబోతుల శ్రీనివాసులు, ముసలిరెడ్డి, బొమ్మా మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

టీడీపీతోనే పల్లెల పురోభివృద్ధి: టీడీపీ అధికారంలోకి వస్తేనే పల్లెల పురోభివృద్ధి సాధ్యమని గుమ్మనూరు జయరాం అన్నారు. మండలంలోని రామరాజుపల్లి, ఎదురూరు, అక్కజాంపల్లి, గుజరాంపల్లి, పొగరూరు గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచు రఘువీరయ్య ఆచారి, నాగిరెడ్డి, విజయభాస్కర్ నాయుడు, మారుతివరప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న జయరాం



రామరాజుపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న గుమ్మనూరు జయరాం

వైసీపీ మేనిఫెస్టో పేలవం

గుంతకల్లు: వైసీపీ ఎన్నికల మేనిఫెస్టో అత్యంత పేలవంగా ఉందని గుమ్మనూరు జయరాం అన్నారు. మంగళవారం రాత్రి బలిజ సంఘ ఆత్మీయ సమావేశానికి గుమ్మనూరు జయరాం, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. జయరాం మాట్లాడుతూ.. గడచిన ఐదేళ్లు టీడీపీ శ్రేణులు, ప్రజలు అధికార పార్టీ నాయకుల కేసులు, దాడులు, దౌర్జన్యాలతో అవస్థలుపడ్డారని, త్వరలో మంచికాలం రాబోతోందని అన్నారు. అంబికా, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ జగన్ కాపులకు రిజర్వేషన్ ఇచ్చేదిలేదని తెగేసిచెప్పాడన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో బలిజలకు తగిన ప్రాధాన్యత లభించిందన్నారు. బలిజ సంఘ అధ్యక్షుడు పూల రమణ, కాపు జేసీ నాయకులు ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాశ్, వీ ఏసుదాస్, బండారు ఆనంద్, కేసీ హరి, ముష్టూరు తిమ్మప్ప, తలారి మస్తానప్ప, హేమాద్రి, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గుడ్‌మార్నింగ్ ప్రోగ్రాం నిర్వహించిన గుమ్మనూర్ ఈశ్వర్

గుత్తి: టీడీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఉదయం జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు ఆధ్వర్యంలో గుడ్‌మార్నింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. పట్టణంలోని గాంధీ సర్కిల్, కోట వీధి, తదితర ప్రాంతాలలో టీ స్టాల్స్ వద్ద ఉన్న ఓటర్లను కలసి జయరాంను గెలపించాలని అభ్యర్థించారు. సంపత్‌కుమార్, కృష్ణయ్య, సుధాకర్‌నాయుడు, వెంకటేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తాగునీటిని కూడా అందించలేని అసమర్థ పాలన

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 30: గ్రామాలలో ప్రజలకు తాగునీరు కూడా అందించలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వ పాలన సాగుతోందని ఎంపీటీసీ గంగాధర మండిపడ్డారు. మంగళవారం ఎంపీడీఓ అధ్యక్షతన మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీలకు సంబంధించి కేవలం 56 మంది ప్రజాప్రతినిధులు సమావేశానికి రాకపోవడం గమనార్హం. అన్ని శాఖల అధికారులు ప్రసంగిస్తూ ఆరు నెలలుగా గ్రామాలలో ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నా సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే తాగునీటి ఎద్దడి

ఉరవకొండ, ఏప్రిల్ 30: అధికారుల నిర్లక్ష్యంతోనే పట్టణంలో తాగునీటి ఎద్దడి నెలకొందని వార్డు సభ్యులు నిరంజన్‌గౌడ్, రామాంజనేయులు పేర్కొన్నారు. పట్టణంలోని మేజరు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం అత్యవసర సమావేశాన్ని సర్పంచు లలితమ్మ అధ్యక్షతన నిర్వహించారు. వార్డు సభ్యులు మాట్లాడుతూ వార్డుల్లో సిస్టమ్స్ ఉన్నప్పుడు ఉప్పు నీటి కోసం ఎందుకు ఖర్చు పెట్టాలన్నారు. తాగునీటి సమస్యపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే సమావేశం ముగిసింది. కార్యదర్శి గౌస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు కాలవ పర్యటన ఇలా...

రాయదుర్గం, ఏప్రిల్ 30: కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు బుధవారం రాయదుర్గం మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 8 గంటలకు కెంచానపల్లిలో, 10 గంటలకు జుంజురంపల్లి, 11 గంటలకు బీఎన్‌హళ్లి, 12 గంటలకు బొమ్మక్కపల్లి, 4 గంటలకు మల్లాపురం గ్రామాలలో రోడ్‌షో నిర్వహించనున్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో ఎస్పీ పర్యటన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

కూడేరు, ఏప్రిల్ 30: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఎస్పీ అమిత్ బర్దర్ పర్యటించారు. మంగళవారం కూడేరు, చోళసముద్రం, కరుట్లపల్లి, జల్లిపల్లి గ్రామాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఎస్పీ తనిఖీ చేశారు. ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోనేలా చర్యలు తీసుకోవాలని సీఐ శివరాముడుకు సూచించారు.

అభివృద్ధే టీడీపీ తారకమంత్రం: అశ్మిత్ రెడ్డి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్30: అభివృద్ధే టీడీపీ తారకమంత్రమని కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని దళిత వాడలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి, విజ్జి, టీడీపీ, బీజేపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, దినేష్‌రెడ్డి, రంగనాథరెడ్డి, గంగాధర్, ఆంజనేయులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలంలోని జూటూరు గ్రామంలో మంగళవారం కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు ఆయన వివరించారు. తెలుగుయువత ఉపాధ్యక్షుడు లోకనాథ్‌రెడ్డి, చిత్తరంజన్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, శశిధర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటశివారెడ్డి, మండల కన్వీనర్ గుర్తి రఘునాయుడు పాల్గొన్నారు.

ఫ్యాన్‌కు ఓటువేస్తే ఆస్తులు గోవింద..

పెద్దవడుగూరు: వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేస్తే ప్రజల ఆస్తులు గోవిందా అని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో జేసీపీఆర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చిందన్నారు. యాక్ట్ ప్రధాన ఉద్దేశం భూములు రీసర్వే చేసి హక్కుదారులను నిర్దేశిస్తారన్నారు. ఈ భూములపై రెండేళ్లపాటు అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. గడువు దాటితే అభ్యంతరం చెప్పే వీలుకూడా ఉండదని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, నాయకులు దివాకర్‌రెడ్డి, గంగరాజుయాదవ్, చిన్నగోవిందు, రమేష్‌యాదవ్, హరికృష్ణారావు, నాగరాజు, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



పెద్దపప్పూరులో ప్రచారంలో పాల్గొన్న అశ్మిత్‌రెడ్డి



పుట్లూరులో ప్రచారం చేస్తున్న పవన్ రెడ్డి

టీడీపీలో చేరిక: మండలంలోని భీమునిపల్లి గ్రామానికి చెందిన పలువురు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన బసిరెడ్డి, పెద్దిరెడ్డి, కాయల గరుడశేఖర్‌రెడ్డి, హరిజన, చంద్ర, కంబయ్య, ఎర్రకంబయ్య, రామ్మూర్తి, చిన్నకంబయ్యలకు తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి, పుట్లూరు లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, అరెకటిక రాష్ట్ర కన్వీనర్ హరికృష్ణారావు, రంగనాయకులు, రంగస్వామి పాల్గొన్నారు.

రాబోయేది కూటమి ప్రభుత్వమే

పుట్లూరు: వచ్చే ఎన్నికల్లో రాబోయేది కూటమి ప్రభుత్వమేనని టీడీపీనేత జేసీ పవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పుట్లూరు పుల్లారెడ్డి, కులశేఖర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రవికుమార్‌రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, రామాంజనేయులు పాల్గొన్నారు.

టీడీపీతోనే కురుబల అభివృద్ధి

● కూటమి అభ్యర్థి కాలవ



కనకదాస చిత్రపటానికి పూజలు చేస్తున్న కాలవ

బొమ్మనహాళ్, ఏప్రిల్ 30: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే కురుబ కులస్థులు అభివృద్ధి చెందారని కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఉద్దేహాళ్ గ్రామంలో కురుబ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన సభలో ఆయన మాట్లాడారు. ముందుగా కురుబల ఆరాధ్యదైవమైన భక్త కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణాల పెత్తందారుడి రూపంలో వచ్చిన వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డిని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. బీజేపీ ఇన్‌చార్జి వసుంధరాదేవి, జనసేన ఇన్‌చార్జి మంజునాథగౌడ్, కురుబ సంఘం నాయకుడు బోరంపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

22 కుటుంబాలు టీడీపీలో చేరిక: దర్గాహోన్నూరు, ఉద్దేహాళ్ గ్రామాల్లో వైసీపీ నుంచి 20, ఉద్దేహాళ్‌కు చెందిన రెండు కుటుంబాలు మంగళవారం కాలవ శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలోకి చేరారు. వైసీపీ ఎంపీటీసీ కోటిరెడ్డి సోదరుడు లక్ష్మీరెడ్డి, లలితల పార్టీలో చేరారు. దర్గాహోన్నూరు మాజీ సర్పంచ్ కేశప్ప, నవీన్, లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో బలిజ తిప్పేస్వామి సోదరులు బండి వన్నూరుస్వామి, కురుబ పాల్తూరు వన్నప్ప, గంగాధర, డీజిల్ రామాంజి, చంద్ర తది తరులు చేరారు.

గ్యార్మెంట్ రంగానికి విద్యుత్ రాయితీలు



29వ వార్డు మహిళలతో కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే గ్యార్మెంట్ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వారి అభివృద్ధికి విద్యుత్ రాయితీలు అందిస్తామని కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. మంగళవారం పట్టణంలోని 29వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. టెక్స్‌టైల్స్ పార్క్‌లో కేటాయించిన గార్మెంట్స్ యూనిట్లను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానన్నారు.

29 కుటుంబాలు చేరిక: పట్టణంలోని 1, 31, 32 వార్డులకు సంబంధించి 29 వైసీపీ కుటుంబాలు మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. వీరికి కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

కాలవ కుటుంబీకుల ప్రచారం: కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు కూతురు కాలవ గౌతమి మంగళవారం కణేకల్లు మండలంలోని యర్రగుంట గ్రామంలో, తనయుడు కాలవ భరత్ గుమ్మఘట్ట మండలంలోని బీటీపీ, కృష్ణాపురం గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డీ.హీరేహాళ్ మండలంలోని గొడిశలపల్లి గ్రామంలో అల్లుడు అనిల్‌కుమార్ ఇంటింటికి ప్రచారం చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 30: పట్టణంలోని ఆలూరు రోడ్డులో 576 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య మంగళవారం తెలిపారు. పట్టణంలోని 60 అడుగుల రోడ్డు వద్ద నివాసముంటున్న బసవరాజు, జగదీష్, మారెప్ప బళ్లారి నుంచి ఆటోలో మద్యం తీసుకుని గుంతకల్లుకు బయలుదేరారు. స్థానిక ఆలూరు రోడ్డులో వాహనాలు తనిఖీ చేయగా ఆటోలో 90ఎంఎల్ 576 టెట్రా ప్యాకెట్ల ఆరు బాక్స్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆటో డ్రైవర్ బసవరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జగదీష్, మారెప్ప పరారీలో ఉన్నారన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గుత్తిలో చోరీ

గుత్తి, ఏప్రిల్ 30: పట్టణ శివారులోని నేమతాబాదు జగనన్న లేఅవుట్ కాలనీలో నివాసముంటున్న వెంకటలక్ష్మి అనే మహిళకు చెందిన కిరాణా షాపులో సోమవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడి రూ.20వేలు, సిగరెట్, బీడీ కట్టలు చోరీ చేసినట్లు బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటి నిర్మాణానికి బంగారు కుదువ పెట్టి రూ.30వేలు షాపులో పెట్టుకోగా అందులో రూ.20వేలు, రూ.2వేలు విలువ చేసే సిగరెట్, బీడీ ప్యాకెట్లు, కూల్‌డ్రింక్ బాటిళ్లను ఎత్తుకెళ్లారని వాపోయింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గడ్డి, వ్యవసాయ పరికరాలకు నిప్పు

కూడేరు, ఏప్రిల్ 30: మండలంలోని శివరాంపేట గ్రామానికి చెందిన కూచే నారాయణస్వామి తోటలో గుర్తు తెలియని వ్యక్తులు పశుగ్రాసం, వ్యవసాయ పరికరాలకు నిప్పు పెట్టగా పూర్తిగా కాలిపోయాయి. మంగళవారం రాత్రి సమయంలో ఈ ప్రమాదం జరగడంతో రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

చికిత్స పొందుతూ యువతి మృతి

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 30: మండలంలోని చదం గ్రామానికి చెందిన శ్రావణి(17) అనే యువతి బెంగుళూరులో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. చదం గ్రామానికి చెందిన శ్రావణి ఐదురోజుల క్రితం కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబసభ్యులు గుర్తించి బెంగుళూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 30: పట్టణ సమీపంలోని యల్లనూరురోడ్డు శివారులో కుళ్లాయమ్మ (67) అనే వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ పోలీసులు మంగళవారం తెలిపారు. పట్టణంలోని జయనగర్‌కాలనీకి చెందిన కుళ్లాయమ్మ భర్త లింగన్న మూడునెలలక్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి దిగాలుగా ఉంటున్న కుళ్లాయమ్మ మనస్థాపం చెంది నాలుగురోజుల క్రితం ఇళ్లువిడిచి వెళ్లిపోయింది. మంగళవారం యల్లనూరురోడ్డు శివారులోని కంపచెట్లలో కుళ్లాయమ్మ శవమై కనిపించింది. అటుగా వెళుతున్న వారు పోలీసులకు సమాచారం అందించారు. వృద్ధురాలి కుమారుడు రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పెద్దవడుగూరు, ఏప్రిల్ 30: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మండలంలోని రౌడీషీటర్లకు తాడిపత్రి డీఎస్పీ గంగయ్య కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట సీఐ రోషన్, ఎస్ఐ శ్రీనివాసులు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

పుట్లూరు, ఏప్రిల్ 30: మండలంలోని కుమ్మనమల, మడ్డిపల్లి గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేసినట్లు మంగళవారం ఎంపీడీఓ దస్తగిరి తెలిపారు. ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారన్నారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతోపాటు ఫొటోల ఆధారంగా డ్వామా పీడీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారని తెలిపారు.

వలంటీర్ల రాజీనామా

బొమ్మనహాళ్, ఏప్రిల్ 30: మండలంలోని బొల్లనగుడ్డం గ్రామ సచివాలయ పరిధిలో తొమ్మిది మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు మంగళవారం పంచాయతీ కార్యదర్శి లోకేష్ తెలిపారు. బొల్లనగుడ్డం, కళ్లుహోళ గ్రామాలలో 23 మంది గ్రామ వలంటీర్లు ఉన్నారని ఇందులో బొల్లనగుడ్డంకు చెందిన వారు ఒకరు, కళ్లుహోళకు చెందిన ఎనిమిది మంది రాజీనామా చేసినట్లు తెలిపారు.